www.flashindianews.com
# ఫ్లాష్ ఇండియా
తెలుగు దినపత్రిక
FLASH INDIA TELUGU DAILY
RNI NO. APTEL/2010/33229
TELANGANA RISING 2047
సంపుటి : 16 | సంచిక :291 | మంగళవారం 06.01.2026 | ఎడిటర్ :కొమరాజు శ్రీనివాసులు | పేజీలు :08 | వెల : రూ 2/-

# రైతులు ఆసక్తి చూపించడం లేదు!

- విద్యుత్ శాఖలో చాలా సంస్కరణలు తీసుకు వచ్చాము
- అడిగిన వారికి ట్రాన్స్ ఫార్మర్స్ ఇస్తున్నాం
- పీఎం కుసుమ్‌కు రైతులు ఆసక్తి చూపించడం లేదు
- వ్యవసాయానికి సోలార్ పవర్
- ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం
- 'పీఎం సూర్య ఘర్ పథకానికి స్పందన కరవు
- ఉచిత విద్యుత్ పథకానికి బ్రేకులు
- ప్రజలకు అవగాహన కల్పిస్తామన్న -డిప్యూటీ సీఎం భట్టి

03

## సభకు ఎందుకు రావడంలేదో బీఆర్ఎస్ సమాధానం చెప్పాలి..

హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా : రాష్ట్రంలో సోలార్ పవర్ ను విస్తృతంగా అందుబాటులోకి తీసుకు రావాలన్న దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గృహ అవసరాలకే కాకుండా వ్యవసాయ రంగానికి కూడా సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలన్న లక్ష్యంతో పలు ప్రణాళికలు రూపొంది స్తున్నామని తెలిపారు. శాసన మండలిలో ఈ అంశంపై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవే శపెట్టిన పీఎం సూర్య ఘర్ పథకానికి ప్రజల నుంచి...



## మహిళా సాధికారత, సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం!

- మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుపై మంత్రి సీతక్క సమాధానం
- మహిళా సాధికారత, సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం
- మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం నిరంతరం కృషి
- అవసరమైన అవకాశాలు, వనరులు కల్పిస్తూ వారి ఆర్థిక బలాన్ని పెంచడమే
- 15 సంవత్సరాలు దాటిన బాలికల నుంచి వృద్ధ మహిళల వరకు

త్వరలో యాదగిరిగుట్ట వద్ద క్యాంటీన్


05

# పొల్యూషన్ డేంజర్

## ఢిల్లీతో పోటీపడుతున్న హైదరాబాద్

కేపీహెచ్బీలో ఎయిర్ క్వాలిటీ సూచీ 302 పాయింట్లుగా నమోదు

- 100 పాయింట్లు దాటితేనే డేంజర్ బెల్స్
- అనేక ప్రాంతాల్లో 100 పాయింట్లకు పైగా వాయు కాలుష్యం
- గ్రేటర్లో రోజు 50 లక్షల వాహనాల రాకపోకలు
- వాటి పొగతో పెరిగిపోతున్న వాయు కాలుష్యం
- జాగ్రత్తలు తీసుకోకపోతే కష్టమేనంటున్న డాక్టర్లు
- పట్టించుకోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు



హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా : హైదరాబాద్ను కాలుష్య భూతం వెంటాడుతున్నది.. ఢిల్లీతో పోటీ పడుతూ వాయు వేగంతో కాలుష్యం విస్తరిస్తున్నది.. గాలిలో నాణ్యత పడిపోవడంలో హైద రాబాద్ నగరం దేశ రాజధానికి సవాల్ విసురుతు న్నది. కొత్త ఏడాది తొలి రోజున పలు ప్రాంతాల్లో ఏక్యూఐ 300 వరకు చేరుకుంది. ఇది థర్డ్ పార్టీ గూగుల్ యాప్లు, పరిక రాల ద్వారా నమోదవుతున్న సూచీల ప్రకారం లెక్క. కానీ, సీపీసీబీ ఏర్పాటు చేసిన సూచీలలో మాత్రం కొత్త ఏడాది గరిష్ఠంగా 170 వరకే నమోదు కావడం గమనార్హం. మిగితా 02 పేజీలో...



03

## ఏపీ ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ సంచలన వ్యాఖ్యలు

### వాదనలు బలంగా వినిపించాలి

ఒకటి, రెండు రోజుల్లో మరోసారి న్యాయవాదులతో సమావేశం
గతంలో ఆగిఉంటే బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు చెప్పలే

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు మహర్దశ..
- ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా..
- గంటల తరబడి చెట్ల కింద నిరీక్షించే పరిస్థితికి తెర
- సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ వ్యవస్థ వల్ల అవినీతికి అడ్డుకట్ట

02

# ఈసారి బడ్జెట్ ఎప్పుడు?

సాంప్రదాయానికి భిన్నమేనా..!

- ఫిబ్రవరి 1న నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెడతారా?
- గత కొన్నేళ్లుగా వస్తున్న సాంప్రదాయం
- ఈసారి ఆదివారం వచ్చిన ఫిబ్రవరి 1

05





## మావోయిస్టులకు డీజీపీ మరో పిలుపు

అతిత్వరలో మావోయిస్టు రహిత రాష్ట్రంగా తెలంగాణ

- ప్రస్తుతం తెలంగాణకు చెందిన 17 మంది మావోయిస్టులే మిగిలి ఉన్నారంటున్న పోలీసులు
- పోలీసుల చేతిలో తెలంగాణకు చెందిన 17 మంది మావోయిస్టుల జాబితా
- వీరు లొంగిపోతే మావోయిస్టు రహిత రాష్ట్రంగా మారనున్న తెలంగాణ
- 17 మంది లొంగిపోవాలని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి విజ్ఞప్తి.

02

## బీఆర్ఎస్‌లో అంతర్గత పోరు..



- కేటీఆర్‌పై విరుచుకుపడ్డ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య
- కేటీఆర్ మాట్లాడుతుంటే సిగ్గేస్తుంది
- బీఆర్ఎస్‌లో అంతర్గత కుమ్ములాటలు..


05

# తెలంగాణ ప్రాజెక్టులకు అడ్డు చెప్పలే

## ఏటా సముద్రంలోకి మూడు వేల టీఎంసీలు

- కృష్ణా, గోదావరి నీళ్ల కోసం కలిసి ముందుకెళ్లాం
- విభజన తర్వాత కాళేశ్వరం కడితే
- అడ్డు చెప్పలే ఏపీలోని నదుల న్నింటినీ అనుసంధానిస్తం
- గంగా, కావేరి కలవాలి..సమస్య పరిష్కారం కావాలి కల్వకుర్తి లిఫ్ట్, ఏఎమ్మార్ ఎత్తిపోతల, నెట్టెంపాడు
- నేనే పూర్తి చేశా గుంటూరులో ఏపీ సీఎం చంద్రబాబు
- గోదావరిలో పుష్కలంగా నీళ్లున్నాయి

03



## ఆ మాట చెప్తేనే కదా కాంగ్రెస్‌లో చేరాం..

త్వరలో బీసీ ప్రజాప్రతినిధులతో సమావేశం: పొన్నం 03

# ఫోన్ ట్యాపింగ్ కేసు..

## ప్రభుత్వ పిటిషన్ తోసిపుచ్చిన సుప్రీం

- సుప్రీంకోర్టులో హరీష్ రావుకు ఊరట
- హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో ప్రభుత్వం అప్పీల్
- స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసిన రేవంత్ సర్కారు
- ఇరువైపులా వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం
- హైకోర్టు తీర్పును సమర్థిస్తూ తీర్పు
- హరీష్ రావుపై విచారణకు నో అంటూ ఆదేశం
- హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోబోమని స్పష్టీకరణ

02

### సుప్రీం కోర్టులో హరీష్ రావుకు ఊరట!



# ప్రపంచ పర్యావరణ సంస్థను అభినందించిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్....

## కలుష్య రహిత మేడారం జాతర జరగాలి

- కాలుష్య రహితంగా మేడారం నిర్మాణం కోసం ప్రజల్ని చైతన్యం
- ఈ సంవత్సరం కూడా తమ సంస్థ ఆధ్వర్యంలో వేలాది మందితో ప్రజా ప్రదర్శనలు ఏర్పాటు
- గవర్నర్ చేతుల మీదుగా ప్రపంచ పర్యావరణ సంస్థ గోడపత్రికను ఆవిష్కరణ

06

గ్రీన్ మేడారం సేవ్ మేడారం నినాదాన్ని పెద్ద ఎత్తున ప్రచారం చేయాలి





# శాసనమండలిలో ఇదే నా చివరి ప్రసంగం

## నిండుసభలో కవిత కంటతడి

- ప్రశ్నించినందుకే పార్టీ నుంచి బయటికి పంపిండ్రు
- కనీసం నన్ను వివరణ కూడా అడగలేదు
- బీఆర్ఎస్ పార్టీ రాజ్యాంగం ఎనిమిది పేజీలే
- బీఆర్ఎస్ చానల్, పేపర్ నాకు ఎప్పుడూ సపోర్ట్ చేయలే
- ఎన్ని అవమానాలు ఎదురైనా నవ్వుకుంటూ పనిచేశా
- ఉద్యమంలో పనిచేసిన వాళ్లను ఆగం చేస్తరనుకోలే
- 20 ఏండ్ల శ్రమను గుర్తించకుండా సస్పెండ్ చేశారు
- మండలిలో ఎమ్మెల్సీ కవిత తీవ్ర భావోద్వేగం

05



వ్యక్తిగా వెళ్లిపోతున్నా.. ఒక శక్తిగా తిరిగొస్తా
తెలంగాణ కోసం కమిటెడ్ గా పనిచేస్తా
అందుకే పదవికి రాజీనామా చేస్తున్నా
మండలిలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

### కొత్త పార్టీపై కవిత సంచలన ప్రకటన

మండలిలో నేరుగా రాజీనామా పత్రాన్ని అందజేసిన కవిత

- పొలిటికల్ పార్టీగా తెలంగాణ జాగృతి
- కొత్తగా రాజకీయాల్లోకి వచ్చేవారికి చోటు కల్పిస్తం
- దళితులు, మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తం
- గన్ పార్కు వద్ద ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- లక్ష్మీ నృసింహస్వామి మీద.. నా ఇద్దరు బిడ్డల మీద ప్రమాణం చేస్తున్న మాది ఆస్తుల పంచాది కాదు

03

ఉద్యమ ద్రోహులంతా బీఆర్ఎస్ పార్టీలో చేరారంటూ ఎమ్మెల్సీ కవిత సంచలనాత్మక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ శాసన మండలిలో ప్రసంగించిన అనంతరం ఆమె గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో అందరూ కలిసి కట్టుగా పనిచేశారని, అధికారం వచ్చాక అసలైన ఉద్యమకారులను బీఆర్ఎస్ నుంచి అన్యాయంగా బయటకు పంపారని విమర్శించారు. తనను కొందరు కక్ష పెట్టి రాజకీయంగా ఎదగకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రైవేటు జూనియర్ కాలేజీల ఇష్టారాజ్యం..

## కొరడా ఝుళిపించిన ఇంటర్ బోర్డు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** 2025-26 విద్యాసంవత్సరంలో నిబంధనలు ఉల్లంఘించిన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 495 ప్రైవేట్ జూనియర్ కాలేజీలపై ఇంటర్మీడియట్ బోర్డు ఏకంగా రూ.5.32కోట్ల ఫైన్ విధించింది. ప్రైవేట్ కాలేజీలు ప్రధానంగా అడ్మిషన్ల ప్రక్రియలో బోర్డు మార్గదర్శకాలను గాలికి వదిలేసినట్లు అధికారులు గుర్తించారు. షెడ్యూల్ కంటే ముందే అడ్మిషన్లు నిర్వహించడం, నిర్ణీత పరిమితికి మించి అదనపు సెక్షన్లను నిర్వహించడం, అనుమతి లేని భవనాల్లో తరగతులు నడపడం, అగ్నిమాపక నిబంధనలు పాటించకపోవడం వంటి అంశాలను గుర్తించారు. చాలా కాలేజీలు కేవలం లాభార్జనే ధ్యేయంగా విద్యార్థుల భద్రతను, బోర్డు నిబంధనలను విస్మరిస్తున్నాయని విచారణలో తేలింది. నిబంధనలను అతిక్రమిస్తే గుర్తింపు రద్దుచేస్తామని గతంలోనే హెచ్చరించినప్పటికీ మార్పు రాకపోవడంతో ఈసారి భారీ జరిమానాలతో గట్టి సంకేతాలు పంపాలని బోర్డు నిర్ణయించింది. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థుల విద్యాసంవత్సరం దెబ్బతినకుండా జరిమానాతో సరిపెట్టినట్లు తెలుస్తున్నది. అయితే భవిష్యత్తులోనూ తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 3,374 జూనియర్ కళాశాలలకు అనుమతులు ఉన్నాయని, గుర్తింపు లేని కళాశాలలు ఏవీ నడవడం లేదని బోర్డు స్పష్టం చేసింది. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

**రూల్స్ ఉల్లంఘించిన కాలేజీలివే..**

తుర్కయంజాల్ లో న్యూ చైతన్య జూనియర్ కాలేజీ పేరుతో సాగర్ హైవే రోడ్డు పక్కన బ్యాంక్ ఆఫ్ బరోడా కార్యాలయంపై అనుమతితో నడిపిస్తున్నారు. కానీ ఇదే పేరుతో న్యూ శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ నిబంధనలకు విరుద్ధంగా మరో రెండు బ్రాంచీలను తుర్కయాంజాల్ లోని కమ్మగూడ, రాఘవేంద్రనగర్ లో నిర్వహిస్తున్నారు. బీఎన్ రెడ్డి సాగర్ కాంప్లెక్స్ మెయిన్ రోడ్డు సమీపంలో కృష్ణవేణి జూనియర్ కాలేజీ అనుమతితో నడిపిస్తున్నారు. ఇదే పేరుతో మరో కాలేజీ శ్రీపురం కాలనీలో అక్రమంగా నడిపిస్తున్నారు. హస్తినాపురం పద్మావతినగర్ కాలనీలో మహర్షి జూనియర్ కాలేజీ అనుమతితో నడిపిస్తున్నారు. ఇదే పేరుతో వనస్థలిపురంలోని ప్రశాంతి కాలనీలో అక్రమంగా కాలేజీ నడిపిస్తున్నారు. హస్తినాపురంలోని అక్షర జూనియర్ కాలేజీ, నవీన జూనియర్ కాలేజీ, మణికొండలోని వాల్యూఓక్ జూనియర్ కాలేజ్, నైన్ జూనియర్ కాలేజ్, మాదాపూర్ లోని అలెన్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ పై సుమారు రూ.కోటి పదిలక్షల పెనాల్టీ విధించాల్సి ఉంది. రూల్ 14 ప్రకారం అనుమతులు లేని కాలేజీలపై రూ.10లక్షల చొప్పున పెనాల్టీ విధించాల్సి ఉంటుంది. రూల్ 14లోని అన్ని సెక్షన్లను కొన్ని కళాశాలలు ఉల్లంఘిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు మహర్దశ..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సమర్థవంతంగా, సులువుగా, పారదర్శకంగా, అవినీతిరహితంగా మెరుగైన సేవలు అందించేందుకు అనేక సంస్కరణలు తీసుకొచ్చామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇవాళ అసెంబ్లీలో ఏవీఎన్ రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెబుతూ.. ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చి గంటల తరబడి చెట్ల కింద నిరీక్షించే పరిస్థితికి తెరపడుతున్నామని తెలిపారు. సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ వ్యవస్థ వల్ల అవినీతికి అడ్డుకట్ట పడుతుందని అన్నారు. రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు గాను 94 అద్దె భవనాల్లో, 50 ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మూడు దశల్లో అన్నింటికీ శాశ్వత భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా, పరిపాలనకు ఇబ్బంది లేకుండా అత్యాధునికంగా కార్పొరేట్ స్థాయిలో సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను దశలవారీగా నిర్మిస్తున్నామని అన్నారు.

**ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా..**

ఇందులో భాగంగా మొదటి దశలో ఔటర్ రింగ్ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి నాలుగు జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 క్లస్టర్లుగా విభజించి సమీకృత సబ్ రిజిస్ట్రార్ భవనాలు నిర్మిస్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి 69 శాతం ఆదాయం వస్తుందని అన్నారు. గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్ మెంట్, ఆర్వో రంగారెడ్డి, గండిపేట్, శేర్లింగంపల్లి, రాజేంద్ర నగర్ లను క్లస్టర్ గా విభజించామని గుర్తుచేశారు. ఈ భవనానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన కూడా చేశారని పేర్కొన్నారు. ఈ నెల చివరి నాటికి మిగిలిన 10 సమీకృత భవనాలకు కూడా శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ప్రభుత్వ తరపున ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా ప్రైవేట్ బిల్డర్లు ఈ భవనాలను నిర్మించేలా ప్రణాళికలు రూపొందించామని అన్నారు. ఒక్కో సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి మూడు నుంచి నాలుగు ఎకరాల స్థలాన్ని కేటాయించామని సభలో ప్రస్తావించారు. రెండో దశలో జిల్లా కేంద్రాల్లో, మూడో దశలో నియోజకవర్గాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు భవనాలను నిర్మిస్తామని అన్నారు. మొదటి ఐదేళ్లు ఈ భవనాలను నిర్మించిన సంస్థ మెయింటెనెన్స్ చేస్తుందని ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు కాదని విన్నవించారు. స్లాట్ బుకింగ్ విధానం తీసుకురావడం వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ సమయం చాలా వరకు తగ్గిందని, ఒక్కో డాక్యుమెంట్ కు 18 నుంచి 21 నిమిషాల్లోనే పూర్తవుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

# స్పీకర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** నదీజలాలపై చర్చ సమయంలో సభను తప్పుదోవ పట్టించారని అందువల్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కు బీఆర్ఎస్ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఇవాళ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సెక్రటరీ తిరుపతికి ఫిర్యాదు కాపీ అందజేశారు. ఇటీవల శాసన సభలో కృష్ణా జలాలపై జరిగిన చర్చ సందర్భంగా తప్పుడు సమాచారం ఇచ్చి సభను తప్పుదోవ పట్టించిన సీఎం రేవంత్ రెడ్డి పై సభా హక్కుల ఉల్లంఘన కింద చర్యలు చేపట్టాలని కోరారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశ మినిట్స్ పై సీఎం తప్పుదోవ పట్టించారని, రాయలసీమ ఎత్తిపోతల పనుల నిలిపివేత, కృష్ణా జలాల్లో తాత్కాలిక ఒప్పందంపై సీఎం సభను తప్పుదోవ పట్టించారని ఫిర్యాదులో ఆరోపించారు.

# తెలంగాణలోని అటవీ శాఖకు ఐఎఫ్ఎస్‌ల కొరత

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** అటవీ శాఖలో ఉన్నతాధికారుల కొరత వెంటాడుతోంది. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) అధికారులు సరియైన సంఖ్యలో లేకపోవడంతో అటవీ శాఖలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కనిపిస్తుంది. రాష్ట్రానికి 81 మంది ఐఎఫ్ఎస్ అధికారులను కేంద్రం కేటాయించింది. అయితే ఇవి కేటాయింపులుగానే మిగులుతున్నాయి. వీటి సంఖ్యకు అనుగుణంగా గత పుష్కర కాలంలో ఏనాడు కేంద్రం కేటాయింపులు చేయలేదు. కొత్త బ్యాచ్ లు వచ్చినా అంతంత మాత్రంగానే కేటాయింపులు చేస్తుంది. తెలంగాణకు కేటాయించిన 81 మంది ఐఎఫ్ఎస్ అధికారుల్లో ప్రస్తుతం 52 మంది మాత్రమే పనిచేస్తున్నారు.వీరిలో కూడా కొందరు అధికారులు ప్రస్తుతం కేంద్ర సర్వీసులకు డిప్యూటేషన్ పై వెళ్లారు. మరికొందరు రాష్ట్రంలోని ఇతర శాఖలకు డిప్యూటేషన్పై వెళ్లారు. రాష్ట్రంలో అంతగా ప్రాముఖ్యత లేని పోస్టింగ్లు వచ్చినప్పుడు ఐఎఫ్ఎస్ అధికారులు తమకున్న ఉన్నత పరిచయాలతో ముఖ్యమైన శాఖల్లోకి డిప్యూటేషన్ పై వెళ్తున్నారు. జిల్లాలో పని చేసినప్పుడు వివిధ కారణాలతో హైదరాబాద్ లో ఉండాలనుకునేవారు ఇతర శాఖల్లోకి వెళ్లి పోస్టింగ్లు తెచ్చుకుంటున్నారు. అటవీ శాఖలో మారుమూల అటవీ ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుంది. అడవులను నరికి వేయకుండా, అక్రమ రవాణా జరగకుండా, అటవీ విస్తీర్ణం కాపాడే విధంగా, అభయారణ్యంలో జంతువుల పరిరక్షణ చేపట్టాల్సి ఉంటుంది.ప్రభుత్వం చేపట్టే మొక్కల పెంపకం, పరిశోధన, శిక్షణ అంశాలపై ఉన్నతాధికారులు నిత్య పర్యవేక్షణ అవసరం. ఉన్నతాధికారుల సంఖ్యనే తక్కువగా ఉండటంతో ఉన్న కింది స్థాయి అధికారులనే పెద్ద పోస్టుల్లో ఇంఛార్జిలుగా నియమిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఖాళీ అవుతున్న సంఖ్యలో కేటాయింపులు ఉండటం లేదు. ఇప్పటికే ఉన్న ఖాళీలను భర్తీ చేసే విధంగా కేంద్రం చర్యలు తీసుకోవడం లేదు. కేంద్రం నుంచి తక్కువగా కేటాయింపులు ఉంటే తాము ఎవరికి చెప్పుకోవాలని అటవీ శాఖ ఉన్నతాధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనుకున్నంత సంఖ్యలో కూడా కేంద్రం నుంచి కేటాయింపులు చేయడం లేదని వారు చెబుతున్నారు.కేంద్ర ప్రభుత్వం ఈ ఖాళీలను భర్తీ చేయాలనే లక్ష్యంతో ఉంటే వాటి భర్తీ సులువు అవుతుందని చెబుతున్నారు. తెలంగాణలోనే కాకుండా దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఐఎఫ్ఎస్ అధికారుల కొరత ఉందని అంటున్నారు. కొరతను కొంత తగ్గించుకోవడానికి రాష్ట్రంలో ఇతర శాఖల్లోకి డిప్యూటేషన్ పై వెళ్లిన వారిని అటవీ శాఖకు తిరిగి రప్పించుకునే పనిలో పడ్డారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల ద్వారా అటవీ శాఖలో ఉన్న వాస్తవ పరిస్థితులను వారికి వివరించి ఐఎఫ్ఎస్ అధికారుల డిప్యూటేషన్లు రద్దు చేసి తమ శాఖకు కేటాయించాలని కోరుతున్నారు.

# పొల్యూషన్ డేంజర్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సీపీసీబీ సూచించే కొలతల్లో కచ్చితత్వం లేదని కొందరు విశ్రాంత ప్రొఫెసర్లు చెబుతున్నారు. హైదరాబాద్ నగరంలోని 14ప్రాం తాల్లో కాలుష్య నియంత్రణ మండలి ఏక్యూఐ పరికరాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా పీసీబీ గరిష్ఠ, కనిష్ఠ సూచీలను వెల్లడిస్తోంది. ఏక్యూఐ 100 దాటితే ముప్పు పొంచి ఉన్నట్లే అని చెబుతోంది. డిసెంబరులో హైదరాబాద్లో గరిష్ఠంగా పీసీబీ లెక్కల ప్రకారం ఏక్యూఐ 132 మాత్రమే ఉంది థర్డ్ పార్టీ యాప్ లలో నమోదైన ఏక్యూఐ 270 వరకు ఉండటం గమనార్హం. ఇంత వ్యత్యాసం ఉండకూడదని ఒక పక్క పరిశీలకులు చెబు తున్నారు. గాలి నాణ్యతను యురోపియన్ ప్రమాణాల మేరకు కొలిచే మెషిన్ల ధర ఒక్కొక్కటి దాదాపు ₹30 లక్షల వరకు ఉంటుంది. పీసీబీ వాడుతున్న పరికరాలు ఆ స్థాయిలో పని చేయలేవని పరిశోధకులు చెబుతున్నారు.

**మూడు రకాల గాలి కాలుష్యం**

గాలిలో కాలుష్యాన్ని బయో, ఫిజికల్, కెమికల్ రియాక్టివ్లని మూడు రకాలుగా పరిగణనలోకి తీసుకుని నాణ్యతను కొలుస్తారు. గాలిలో తేమ, బ్యాక్టీరియా, సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ వంటి వ్యర్థాల వాసనలన్నీ మొదటి రకంలోకే వస్తాయి. సూక్ష్మధూళి కణాలను రెండో రకంలోకి తీసు కుంటారు. రసాయన ప్రభావం కల్గించే కార్బన్ డయాక్సైడ్, సల్ఫర్, మిథనాల్, నైట్రోజన్ ఆక్సైడ్, బెంజిన్ తదితరాలను కెమికల్ రియాక్టివ్ తీసుకుం టారు. ఇవన్నీ ప్రమాణాలను దాటితే ప్రజలకు ఊపిరితిత్తుల వ్యాధులు, క్యాన్సర్ వంటివి సోకే ప్రమాదం ఉంటుంది.

**50 లక్షల వాహనాలతో ..**

హైదరాబాద్ లో దాదాపు 80 లక్షల వాహనాలుంటే రోజూ సగటున 50 లక్షల వరకు రోడ్డు మీదకు వస్తున్నాయి. వీటి నుంచి వెలువడే పొగ గాలి నాణ్యతను తీవ్ర ప్రభావితం చేస్తోంది. వీటితో పాటు భవన నిర్మాణాలు, చెత్తాచె దారం, మురుగు, పరిశ్రమల నుంచి వెలువడే ఘాటు వాసనలు వాయు నాణ్యతను మరింత క్షీణింపచేస్తున్నాయి.

**కేపీహెచ్బీలో ఏక్యూఐ 302 :**

శనివారం ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్ కూకట్ పల్లి హౌజింగ్ బోర్డు కాలనీలోని గాలిలో వాయు నాణ్యత సూచీ 302 సూచించింది. ఇది ఢిల్లీలో ఏక్యూఐ (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ )తో సమానంగా ఉంది. కానీ, ఈ ప్రాంతంలో సీపీసీబీ (సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు)కు సంబంధించిన వాయు నాణ్యతను లెక్కించే సూచీలే లేవు. శనివారం సీపీసీబీ లెక్కల ప్రకారం హైదరాబాద్ లోని బొల్లారం పారిశ్రామిక ప్రాంతంలో ఏక్యూఐ గరిష్ఠంగా 142, రామచంద్రాపు రంలో కనిష్ఠంగా 73 నమోదవడం గమనార్హం.

**అమ్మో 35 సిగరెట్లు తాగినట్లే!:**

గాలి నాణ్యత 100 దాటితేనే చాలా ప్రమాదకరం. ఒకవేళ 300లకు చేరితే ఆ గాలి పీల్చిన వారికి పలు రకాల వ్యాధులు వచ్చే అవకాశముంది. దాన్ని పీలిస్తే రోజుకు 30 నుంచి 35 సిగరెట్లు కాల్చిన దానితో సమానమని సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు. గాలి నాణ్యతను సీపీసీబీ నమోదు. చేస్తున్నా, ఎక్కడా కచ్చితమైన లెక్కలు రావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. థర్డ్ పార్టీ, గూగుల్ యాప్, సీపీసీబీ ప్రకటిస్తున్న సూచీలకు చాలా వ్యత్యాసం ఉండటమే ఇందుకు ప్రధాన కారణం.

**వ్యత్యాసం ఉంది.**

గాలిలోని వివిధ రకాలైన అంశాల ఆధారంగా ఏక్యూఐని గణిస్తామని పీసీబీ పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ శరత్ అంటున్నారు. జాతీయ స్థాయి గాలి నాణ్యత ప్రమాణాల ప్రకారమే కాలుష్య నియంత్రణ మండలి లెక్కిస్తుందని తెలిపారు. థర్డ్ పార్టీ యాప్లు యూఎస్ ఈపీఏ ప్రమాణాల ప్రకారం కొలుస్తు న్నాయని అంటూ . దానివల్ల కొంత వ్యత్యాసం ఉంటుందని పేర్కొన్నారు. కనిష్ఠాన్ని పరిగణనలోకి తీసుకోకుండా గరిష్టమైన దాన్ని మాత్రమే యాప్లు చూపిస్తున్నాయన్నారు. పీసీబీ సగటును మాత్రమే తీసుకుంటుందని వెల్లడించారు... మన జాతీయ ప్రమాణాలతో కాకుండా యూఎస్ఈపీఏ ప్రమాణాలతో పరిశీలిస్తే మన దగ్గర గాలి నాణ్యత తక్కువగా ఉన్నట్లు వస్తోందని వివరణ ఇచ్చారు.

**పీసీబీ లెక్కలు తప్పులు తడక**

పీసీబీ పరికరాల మీద పెద్దగా నమ్మకం లేదని జేఎన్టీయూ హైదరాబాద్ విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ కె.ఎం.లక్ష్మణరావు పేర్కొన్నారు... గూగుల్ యాప్లో కొంతవరకు నిజమే ఉంటుందని వెల్ల డించారు. హైదరాబాద్లో వాయు నాణ్యత రోజురోజుకూ దారుణంగా పడిపోతోందని తేల్చి చెప్పారు. దాని మీద నేను లోతుగా పరిశోధన చేస్తున్నామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారమే ఏక్యూఐ పరికరాలు ఉండాలనేది తన అభిప్రాయమన్నారు.

# ఆమెవి అన్నీ డ్రామాలే..!

- కవిత వ్యాఖ్యలపై గొంగిడి సునీత ఘాటు విమర్శలు
- బీఆర్ఎస్‌కు పెను ఇబ్బందిగా కవిత వ్యవహారం
- రాజీనామా నాటకమే : సునీత ఆరోపణ
- పార్టీని డ్యామేజ్ చేసే ప్రయత్నం : గొంగిడి సునీత



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్సీ కవిత వ్యవహారం ఇప్పుడు తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. కవిత ఇటీవల చేసిన వ్యాఖ్యలపై మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అత్యంత ఘాటుగా స్పందించారు. కవిత మాటలు బీఆర్ఎస్ పార్టీకి పెను ఇబ్బందిగా మారాయని, ఆమె ఎవరో వెనుక ఉండి ఆడిస్తుంటే కీలుబొమ్మగా మారి ఇలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ముఖ్యంగా కేసీఆర్ గారిని కంటతడి పెట్టిస్తూ, ఆయనను మానసిక క్షోభకు గురి చేస్తున్న వైనాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని సునీత స్పష్టం చేశారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యేలందరూ అసెంబ్లీని బహిష్కరిస్తే, కవిత మాత్రం భిన్నంగా వ్యవహరించడం వెనుక ఉన్న మతలబు ఏమిటని ఆమె నిలదీశారు.కవిత తన ఎమ్మెల్సీ పదవికి చేసిన రాజీనామా కేవలం ఒక నాటకమని, ఆమె మనస్ఫూర్తిగా ఆ పని చేయలేదని సునీత ఎద్దేవా చేశారు. ఒకవేళ నిజంగానే పదవి అవసరం లేదనుకుంటే కౌన్సిల్ సమావేశాలకు ఎందుకు హాజరయ్యారని ప్రశ్నించారు. అసలు పార్టీలో స్వేచ్ఛ లేకపోతే కవిత ఇన్ని పదవులు ఎలా పొందగలిగారని, ఓడిపోయినప్పటికీ కేసీఆర్ గారు ఆమెకు ఎమ్మెల్సీగా గౌరవప్రదమైన అవకాశం కల్పించిన విషయాన్ని మర్చిపోకూడదని హితవు పలికారు. పార్టీలో కవితకు ఉన్నంత చనువు మరెవరికీ లేదని, అలాంటిది ఇప్పుడు పార్టీని డ్యామేజ్ చేసేలా మాట్లాడటం కూర్చున్న కొమ్మను నరుక్కున్న చందంగా ఉందని మండిపడ్డారు.తెలంగాణ రాష్ట్ర సమితిని బీఆర్ఎస్ పార్టీగా మార్చడం ఇష్టం లేదంటున్న కవిత, మరి తన సొంత సంస్థ అయిన తెలంగాణ జాగృతిని 'భారత జాగృతి'గా ఎలా మార్చారని సునీత నిలదీశారు. ఇది ఆమె ద్వంద్వ వైఖరికి నిదర్శనమని, కంకణం కట్టుకుని మరీ బీఆర్ఎస్ పార్టీని ఆగం చేయాలని కవిత చూస్తున్నారని ఆరోపించారు. లిక్కర్ కేసులో కవిత ఇరుక్కున్నప్పుడు హరీష్ రావు , కేటీఆర్ వారానికి నాలుగు సార్లు ఢిల్లీకి తిరిగి ఆమె కోసం ఎంతో శ్రమించారని, కానీ ఇప్పుడు ఆమె మాత్రం పార్టీకి వెన్నుపోటు పొడిచేలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలకు కనీస సమయం ఇవ్వని ప్రభుత్వం, కవితకు మాత్రం అంత సమయం ఎలా కేటాయించిందో చూస్తుంటే ఆమెను ఎవరు నడిపిస్తున్నారో స్పష్టంగా అర్థమవుతోందని, ఇకపై ఆమె ఆటలు సాగవని గొంగిడి సునీత హెచ్చరించారు.

## కవిత ఆరోపణలు.. చర్యలు తీసుకోని సీఎం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీ స్థాపించే అంశం ఆమె వ్యక్తిగతమని టీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తెలిపారు. సోమవారం హైదరాబాద్ లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ.. రాజకీయ పార్టీ పెట్టే స్వేచ్ఛ అందరికీ ఉంటుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్, హరీష్ రావు, కేటీఆర్ పై కవిత ఆరోపణల ఆధారంగా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు.అందుకు సంబంధించిన ఆధారాలు ఇవ్వడానికి కవిత సిద్ధంగా ఉన్నా.. చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య అంతర్గత ఒప్పందం కుదిరిందని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను కాపాడుతోంది.. సీఎం రేవంత్‌రెడ్డేనని బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీలు రెండు ఒక్కటే అనడం ఎమ్మెల్సీ కవిత అవగాహనా లోపమని తెలిపారు.సోమవారం కల్వకుంట్ల కవిత.. శాసన మండలికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. మండలిలో తనది ఇదే చివరి ప్రసంగమని ఆమె కన్నీరు పెట్టుకున్నారు. ఒక వ్యక్తిగా బయటకు వెళ్తున్నానని.. బలమైన శక్తిగా తాను మళ్లీ చట్టసభల్లోకి వస్తానంటూ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తన రాజకీయ భవిష్యత్‌తోపాటు తాను ఎదుర్కొన్న పరిస్థితులు, బీఆర్ఎస్ పార్టీపై కవిత హాట్ కామెంట్ చేశారు. తన రాజీనామాను ఆమోదించాలంటూ మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఈ సందర్భంగా కవిత విజ్ఞప్తి చేశారు.

## మావోయిస్టులకు డీజీపీ మరో పిలుపు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దండకారణ్యంలో మిగిలిపోయిన 17 మంది తెలంగాణ మావోయిస్టులకు డీజీపీ శివధర్ రెడ్డి మరో కీలక పిలుపునిచ్చారు. పునరావాసం కల్పించడంతో పాటు, వారి మీదున్న రివార్డులు అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం అడవుల్లో ఉండి పోరాటం చేయలేని పరిస్థితులు ఏర్పడ్డాయని.. అనవసరంగా ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని విజ్ఞప్తి చేశారు. కాగా, పీఎల్ జీఏ బెటాలియన్ లో 400 మందికి పైగా మావోయిస్టులు ఉండేవారని.. ఇప్పుడు వారి సంఖ్య 66కు చేరిందన్నారు డీజీపీ. ఈ సంఖ్యను బట్టిచూస్తే పీఎల్ జీ పూర్తిగా క్షీణించినట్లు అర్థమవుతోందన్నారు. రాజిరెడ్డి లొంగుబాటుతో ఇంకా ఒకరు మాత్రమే తెలంగాణ రాష్ట్ర కమిటీ వారు మావోల్లో మిగిలారని వివరించారు. సీఎం పిలుపుతో మావోయిస్టులు లొంగిపోతున్నారని డీజీపీ తెలిపారు. డివిజన్ సభ్యులకు రూ.5 లక్షలు, ఏరియా సభ్యులకు రూ.4 లక్షలు, మిగతా సభ్యులకు రూ.1 లక్ష రివార్డు అందజేస్తామని భరోసా ఇచ్చారు.

## పుట్టింట్లో ఉరేసుకున్న భార్య..

**సంగారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** సంగారెడ్డి జిల్లా ఐలాపూర్ పరిధి చిన్నతండాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కుటుంబ కలహాల కారణంగా భార్య అనూష(25) ఇటీవల పుట్టింటికి వచ్చింది. తీవ్ర మనస్థాపంతో సోమవారం ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలిసి భర్త లాల్ శేఖర్ కూడా ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ విభేదాల కారణంగా గతకొన్నాళ్లుగా ఇద్దరూ విడివిడిగా ఉంటున్నారు. వీరిది ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు అయితే.. ఉపాధి కోసం ఐలాపూర్ కు వచ్చి నివాసం ఉంటున్నారు. ఇరు కుటుంబాల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఆత్మహత్యలకు సంబంధించిన కారణాలపై ఆరా తీస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# మున్సిపల్ ఎన్నికల సందడి షురూ..

## జోరుగా ప్రధాన పార్టీల సన్నాహక సమావేశాలు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలోని పట్టణాల్లో ఓవైపు సంక్రాంతి పండుగ సందడితో పాటు మున్సిపల్ ఎన్నికల కోలాహలం నెలకొంది. మున్సిపల్ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం తన సన్నద్ధతను ఎన్నికల సంఘానికి తెలియజేయగా.. ఈసీ ఎన్నికల పనులను వేగవంతం చేసింది. దీనిలో భాగంగా ఓటరు జాబితాను వార్డుల వారీగా ఫైనల్ చేసే పనిలో ఈసీ నిమగ్నమైంది. ఎన్నికల సంఘం, ప్రభుత్వం రెండు కూడా ఎన్నికలకు సన్నద్ధం కావడంతో పట్టణ ప్రాంత రాజకీయ పార్టీల కేడర్ లో ఒక్కసారిగా కదలిక వచ్చింది. పరిషత్ ఎన్నికల అనంతరం మున్సిపల్ఎన్నికలు ఉంటాయని ముందుగా అంచనా వేసినా అది రివర్స్ అయ్యింది. గతానికి భిన్నంగా ముందుగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రాజకీయ నాయకులు ఈనెల 1న ప్రకటించిన ఓటరు జాబితా ముసాయిదాలో తమ వార్డు ఓటరు జాబితాను సరిచూసుకునే పనిలో నిమగ్నమయ్యారు. తమ వార్డులో ఎన్ని ఓట్లు ఉన్నాయి? ఏ సామాజిక వర్గ ఓట్లు ఎన్ని ఉన్నాయనే విశ్లేషణ చేసుకుంటున్నారు. తమ వార్డు ఏ సామాజిక వర్గానికి రిజర్వ్అవుతుంది? ఏ వర్గానికి రిజర్వ్అయితే ఎవరెవరు పోటీలో ఉంటారు? తమకు, తమ సామాజిక వర్గానికి ఎంత వరకు చాన్స్ ఉంటుంది? పార్టీలో ప్రత్యర్థులు ఎవరు? పోటీలో ఎవరెవరు ఉండే అవకాశం ఉంది? ఇలాంటి లెక్కలు వేసే పనిలో నిమగ్నమయ్యారు.

**ఎన్నికల ఖర్చుపై ఆరా?**

ఎన్నికలకు ముందు గానే వార్డులో తమ పార్టీ నాయకులు, తమ అనుచరులతో నేతలు చర్చలు జరుపుతున్నారు. వీటికి తోడు ఎన్నికల్లో ఎంత ఖర్చు అవుతుంది? తాము ఎంతవరకు ఖర్చును భరించగలుగుతామనే విషయాలను తమ అనుచరులు, శ్రేయోలాభిషులు, వార్డులోని బంధువులు ఇతరులతో చర్చిస్తున్నారు. ఆశావహులు ఆర్థిక వనరులను సమకూర్చుకునే పనిలో ఉన్నారు. అందుకే లెక్కల మీద లెక్కలు వేస్తున్నారు. అన్ని పార్టీల్లోని వార్డు స్థాయి నాయకులందరూ ఇదే పనిలో బిజీగా ఉన్నారు. దీంతో వార్డుల్లో రాజకీయ కోలాహలం నెలకొంది. గతంలో ఉన్న వార్డుల రిజర్వేషన్ ల ఆధారంగా ఈసారి ఏ సామాజిక వర్గానికి రిజర్వ్అవుతుందా? అని అంచనా వేస్తున్నారు. దానికి అనుగుణంగా తామే బరిలో ఉంటామని ప్రకటించుకుంటున్నారు.

**ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునే పనిలో..**

పార్టీ గుర్తుల మీద మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునే పనిలో నాయకులు బిజీగా ఉన్నారు. రెండేండ్ల క్రితం అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీని గుర్తుచేసే పనిలో ఉన్నారు. బీఆర్ఎస్నుంచి పార్టీలో చేరిన వారికి కాకుండా తమకే టిక్కెట్టు ఇవ్వాలని కోరుతున్నారు. అధికార కాంగ్రెస్, బీజేపీ పార్టీ నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. బీఆర్ఎస్కూడా త్వరలోనే నియోజకవర్గ, జిల్లా స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నది. పార్టీ గుర్తులపై జరిగే ఎన్నికలు కావడంతో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు కూడా వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎక్కడా తేడా వచ్చినా పార్టీ అగ్రనాయకత్వం దృష్టిలో తమపై చెడు అభిప్రాయం ఏర్పడే అవకాశం ఉందని ఆందోళనలో ఉన్నట్టు తెలుస్తున్నది. ఎన్నికల్లో గెలుపునకు పార్టీ అభ్యర్థుల ఎంపిక కీలకం కావడంతో ఒక్కో సామాజిక వర్గం నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేసుకుని పార్టీలు సిద్ధంగా ఉంచుకుంటున్నట్టు తెలుస్తున్నది.

**కత్తిమీద సాములా అభ్యర్థుల ఎంపిక..**

వార్డు స్థాయిలో బలహీనమైన అభ్యర్థులు ఉన్న దగ్గర టిక్కెట్టు ఇస్తే పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్న బలమైన నేతల విజ్ఞప్తులను పార్టీల నేతలు పరిశీలిస్తున్నారు. బలమైన అభ్యర్థులు, గెలుస్తారని నమ్మకం ఉన్నవారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. అధికార పార్టీలో అభ్యర్థుల పోటీ భారీగా ఉన్నది. దీంతో ఎమ్మెల్యేలు, ఇన్ చార్జిలు, మాజీ ఎమ్మెల్యేలకు అభ్యర్థుల ఎంపిక కత్తి మీద సాములా మారనుందని తెలుస్తున్నది. రెబెల్స్ ను బుజ్జగించడం, బరిలో నిలిచిన అభ్యర్థిని గెలిపించడం, మేయర్, చైర్మన్ స్థానాలను పార్టీ కైవసం చేసుకునేలా చూడటం నిజంగా పరీక్షే అని అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష నాయకుల్లోనూ చర్చ జరుగుతున్నది. అందుకే ముందుగానే బలమైన అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. ఇటీవల జరిగిన సర్పంచ్ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడంతో 16 మంది అధికార పార్టీ ఎమ్మెల్యేలకు రాష్ట్ర అధినాయకత్వం క్లాస్ పీకింది. వచ్చే మున్సిపాలిటీ ఎన్నికల్లో కూడా తక్కువ సీట్లు సాధించి, మున్సిపల్ చైర్మన్ పదవిని ప్రత్యర్థి పార్టీలు కైవసం చేసుకుంటే సదరు ఎమ్మెల్యేల రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకమేనని అధికార పార్టీ కీలక నేతలు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు బీజేపీ, బీఆర్ ఎస్పార్టీలు ఈ ఎన్నికల్లో తమ ప్రాబల్యం పెంచుకోవడానికి తీవ్ర కసరత్తు చేస్తున్నట్టు సమాచారం.

# రైతులు ఆసక్తి చూపించడం లేదు!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో సోలార్ పవర్ ను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలన్న దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గృహ అవసరాలకే కాకుండా వ్యవసాయ రంగానికి కూడా సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలన్న లక్ష్యంతో పలు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. శాసన మండలిలో ఈ అంశంపై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్య ఘర్ పథకానికి ప్రజల నుంచి అనుకున్నంత స్థాయిలో స్పందన రావడం లేదని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉచిత విద్యుత్ అందిస్తున్న నేపథ్యంలో సోలార్ ప్యానెల్స్ కోసం ఇంటి మీద రూఫ్ ఏర్పాటు చేయాల్సి రావడం కూడా ప్రజలు వెనకడుగు వేయడానికి కారణమవుతోందని చెప్పారు.పీఎం కుసుమ్ పథకాన్ని మరింత ప్రభావవంతంగా అమలు చేయాలనే ఉద్దేశంతో కొడంగల్, బొనకల్ మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్ గా సోలార్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి కొంత సబ్సిడీ అందుతుందని, మొత్తం పథకం వ్యయం సుమారు రూ.519 కోట్ల రూపాయలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి రెడ్కో నోడల్ ఏజెన్సీగా పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 52 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, అదేవిధంగా 20 లక్షల విద్యుత్ కనెక్షన్లను పీఎం సూర్య ఘర్ పథకంతో అనుసంధానం చేయాలనే అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి చర్చించామని తెలిపారు.స్వయం సహాయక సంఘాలకు పొలాల్లో సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ, లీజు భూముల్లో ఈ సదుపాయం కల్పించలేమని కేంద్ర నిబంధనలు స్పష్టం చేస్తున్నాయని డిప్యూటీ సీఎం భట్టి చెప్పారు. ఈ కారణంగా రైతులు కూడా పీఎం కుసుమ్ పథకంపై పెద్దగా ఆసక్తి చూపించడం లేదన్నారు. అయినప్పటికీ సాధ్యమైనంత వరకు ఈ పథకాలను అమలు చేసి సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు బీజేపీ సభ్యులు సహకరించాలని కోరారు.'ట్రాన్స్ ఫార్మర్స్, వ్యవసాయ పంపు సెట్ల కోసం రైతులు దరఖాస్తు చేసుకున్నారు. 3,48,462 మంది దరఖాస్తు చేసుకున్నారు. 75 పైచిలుకు ట్రాన్స్ ఫార్మర్స్ మంజూరు చేశాం. విద్యుత్ శాఖలో చాలా సంస్కరణలు తీసుకువచ్చాము. 1912 కు ఫోన్ చేస్తే ఎలక్ట్రికల్ అంబులెన్స్ ద్వారా ఫిర్యాదు చేసిన ప్రాంతానికి వెళ్లి సమస్య పరిష్కారం చేస్తారు. అడిగిన వారికి ట్రాన్స్ ఫార్మర్స్ ఇస్తున్నాం. గత కొంతకాలంగా విద్యుత్ శాఖలో ప్రజా బాట నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తున్నాం. గత ఏడాది 56807 spdcl పరిధిలో కొత్త కనెక్షన్లు, ఎన్పిడీసీఎల్లో 41 086 కనెక్షన్లు.. మొత్తంగా 97893 కొత్త కనెక్షన్లు ఇచ్చాము. ఈ ఏడాదిలో మరో 20 వేల కొత్త కనెక్షన్లు ఇస్తాం. రాష్ట్రంలో ట్రాన్స్ ఫార్మర్స్ కొరత లేదు' అని డిప్యూటీ సీఎం చెప్పారు.

**సభకు ఎందుకు రావడంలేదో బీఆర్ఎస్ సమాధానం చెప్పాలి..**

తెలంగాణ శాసనసభ శీతాకాల సమావేశాలను హాజరుకాకపోవడంపై ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సమాధానం చెప్పాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇవాళ అసెంబ్లీలో మీడియా ప్రతినిధులతో చిట్చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. సభకు గైర్హాజరు కావడం, ప్రజా సమస్యలపై చర్చ నుంచి తప్పించుకోవడంపై ఆయన మండిపడ్డారు. రాష్ట్రానికి కీలకమైన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై చర్చ జరగాలని బీఏసీ లో బీఆర్ఎస్ పట్టుబట్టిందని, తీరా ప్రభుత్వం చర్చకు సిద్ధమైతే సమాధానం చెప్పలేక ఆ పార్టీ నేతలు భయపడి పారిపోయారని విమర్శించారు. వాళ్లకు ఇబ్బంది అనిపించిన రోజున వాకౌట్ చేశారంటే అర్థం ఉంది, కానీ మిగతా రోజులు సభకు ఎందుకు రావడం లేదో సమాధానం చెప్పాలి ఆయన ప్రశ్నించారు. అసెంబ్లీకి రాకుండా ప్రజల గొంతును నొక్కే ప్రయత్నం బీఆర్ఎస్ చేస్తోందని ధ్వజమెత్తారు.

**కవిత ప్రతి మాట సభలో రికార్డ్ అయింది..**

శాసనమండలిలో ఎమ్మెల్సీ కవిత భావోద్వేగానికి గురవ్వడంపై భట్టి స్పందిస్తూ.. ఆమె మాట్లాడిన ప్రతి మాట సభ రికార్డు అయిందని తెలిపారు. సభలో జరిగిన పరిణామాలను ప్రభుత్వం గమనిస్తోందని, నిబంధనల ప్రకారమే చర్చలు సాగుతాయని స్పష్టం చేశారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో మార్పులు చేస్తూ రాష్ట్రాలపై భారం వేస్తుంటే, దానిపై చర్చించాల్సిన బాధ్యత ప్రతిపక్షానికి లేదా అని ఫైర్ అయ్యారు. ఉపాధి హామీ పథకం బీఆర్ఎస్ కు ఇంపార్టెంట్ కాదా.. అసలు పేదల సమస్యలను మీరు గుర్తించారా లేదా.. చర్చలో పాల్గొనకుండా సభను బహిష్కరించడం అంటే ప్రజలకు అన్యాయం చేయడమేనని భట్టి అన్నారు. సభ ఎన్ని రోజులు జరగాలి, ఏ అంశాలపై చర్చించాలి అనేది పూర్తిగా స్పీకర్ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం మాత్రం ప్రజా సమస్యలపై ఏ సమయంలోనైనా చర్చకు సిద్ధంగా ఉందని, బీఆర్ఎస్ తన వైఖరిని మార్చుకోవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హితవు పలికారు.

# వాదనలు బలంగా వినిపించాలి

## ఏపీ ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఏపీ ప్రాజెక్టులపై తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పోలవరం- నల్లమల్ల సాగర్ ప్రాజెక్టులను తాము అన్ని ఫోరమ్ లలో వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావు చూపిస్తున్న లేఖ దీనికి సంబంధించినది కాదని క్లారిటీ ఇచ్చారు. పోలవరం- నల్లమల్ల ఇంటర్ స్టేట్ రూల్స్ కు వ్యతిరేకమని జీఆర్ఎంబీకి తామే లేఖ రాశామని ప్రస్తావించారు. తమ అభిప్రాయాన్ని జీఆర్ఎంబీ కూడా సమర్థించిందని గుర్తుచేశారు. ఇవాళ(సోమవారం) అసెంబ్లీ మీడియా పాయింట్ లో చిట్ చాట్ చేశారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. పోలవరం-నల్లమల్ల ప్రాజెక్టును మహారాష్ట్ర, కర్ణాటక కూడా వ్యతిరేకిస్తుందని తెలిపారు. సుప్రీంకోర్టులో వాదనలు బలంగా వినిపించాలని న్యాయవాది అభిషేక్ సింఘ్వీకి సూచించామని పేర్కొన్నారు. ఈ కేసును వచ్చే సోమవారానికి సుప్రీంకోర్టు వాయిదా వేసిందని తెలిపారు. రిట్ పిటిషన్లో కాదిని.. సూట్ పిటిషన్లో రావాలని తమకు సుప్రీంకోర్టు సూచించిందని అన్నారు. ఈ కేసులో స్టే ఇవ్వాలని సుప్రీంకోర్టును వచ్చే సోమవారం కోరుతామని తెలిపారు. వచ్చే విచారణకు తాను కూడా ప్రత్యక్ష్యంగా హాజరవుతానని స్పష్టం చేశారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.ఒకటి, రెండు రోజుల్లో మరోసారి న్యాయవాదులతో సమావేశం అవుతామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రాయలసీమ ఎత్తిపోతల పథకం ఆగిందని ప్రస్తావించారు. గతంలో ఆగిఉంటే బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు చెప్పలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తమ ఒత్తిడి వల్లే ఏపీ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు ఆపేశారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ హయాంలో కృష్ణ- గోదావరి జలాల్లో తెలివి ఎక్కువ పని తక్కువ అని చెప్పుకొచ్చారు. అతి తెలివితో బీఆర్ఎస్ తెలంగాణకు భారీ నష్టం చేసిందని ధ్వజమెత్తారు. పాలమూరు రంగారెడ్డిని జూరాల నుంచి శ్రీశైలానికి మార్చి , తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు కాళేశ్వరాన్ని మార్చి భారీ నష్టం చేశారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కొత్త పార్టీపై కవిత సంచలన ప్రకటన

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఉద్యమ ద్రోహులంతా బీఆర్ఎస్ పార్టీలో చేరారంటూ ఎమ్మెల్సీ కవిత సంచలనాత్మక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ శాసన మండలిలో ప్రసంగించిన అనంతరం ఆమె గన్ పార్క్ లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో అందరూ కలిసికట్టుగా పనిచేశారని, అధికారం వచ్చాక అసలైన ఉద్యమకారులను బీఆర్ఎస్ నుంచి అన్యాయంగా బయటకు పంపారని విమర్శించారు. తనను కొందరు కక్ష పెట్టి రాజకీయంగా ఎదగకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిదున్నరేళ్లలో 14 లక్షల కోట్ల బడ్జెట్ పెడితే, అందులో 12 లక్షల కోట్లు ఖర్చు చేసి 1.89 లక్షల కోట్లు కేవలం నీటి పారుదలకే వినియోగించారని, ఎందుకు పేదలకు ఇళ్లు ఇవ్వలేకపోయాం? అని ప్రశ్నించారు. సమస్యలపై ప్రశ్నిస్తే తనను అవమానకరంగా పార్టీ నుంచి బహిష్కరించారని కవిత ఆరోపించారు.

**రాష్ట్రంలో కొత్త రాజకీయ వేదిక రాబోతోంది..**

పార్టీలో ఉన్న ఎంతోమంది ఆశలు అడియాశలు అయ్యాయని తెలిపారు. "ఇవాళ అన్ని బంధనాలు తెంచుకుని బయటకు వస్తున్నాను. ఇది కేవలం నా ఆత్మగౌరవం కోసం జరుగుతున్న పోరాటం కాదు" అని ఆమె అన్నారు. తనలాగే తెలంగాణ ఆడబిడ్డలకు రోషం ఎక్కువని, యువత కోసం కొత్త రాజకీయ వేదిక రాబోతోందని చెప్పారు. వామపక్ష నేతలు, మావోయిస్టు సానుభూతిపరులు, ప్రజాస్వామ్యవాదులు తమతో పనిచేయాలనుకునే వారందరికీ 'తెలంగాణ జాగృతి' ఆహ్వానం పలుకుతోందని తెలిపారు. తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా మారబోతోందని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో జాగృతి కూడా పోటీలో ఉంటుందని, ప్రజల పక్షాన మళ్లీ సభలో అడుగుపెడతామని చెప్పారు. మహిళల హక్కుల కోసం తనను ఆశీర్వదించాలని కవిత గన్ పార్క్ వేదికగా సంచలన ప్రకటన చేయడం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది.

**మండలిలో నేరుగా రాజీనామా పత్రాన్ని అందజేసిన కవిత**

తెలంగాణ శాసనమండలిలో ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు చేసి, సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. అనంతరం ఆమె జాతీయా మీడియాతో మాట్లాడుతూ కీలక ప్రకటన చేశారు. ఈ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.. తాను త్వరలోనే కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె తన శాసనమండలి సభ్యత్వానికి మరోసారి రాజీనామా చేసినట్లు తెలిపారు. తానే నేరుగా మండలిలో తన రాజీనామా పత్రాన్ని సమర్పించానని, చైర్మన్ దీనిని ఆమోదిస్తారని ఆశిస్తున్నట్లు ఆమె మీడియాతో చెప్పుకొచ్చారు.అలాగే బీఆర్ఎస్ పార్టీ తనను సస్పెండ్ చేసిన తీరు అత్యంత అవమానకరంగా ఉందని, ఆ సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, దీనిపై మాట్లాడటానికి తనకు మాటలు కూడా రావడం లేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ విఫలమైందని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే ధోరణిని అవలంబిస్తోందని ఆమె విమర్శించారు. రాష్ట్రానికి ప్రస్తుతం ఒక స్వతంత్ర రాజకీయ శక్తి అవసరం ఉందని, అందుకే ప్రజల హక్కుల కోసం పోరాడేందుకు అతి త్వరలోనే కొత్త పార్టీని స్థాపిస్తామని కల్వకుంట్ల కవిత జాతీయ మీడియాకు స్పష్టంగా చెప్పుకొచ్చారు. దీంతో గత కొంత కాలంగా కవిత సొంత పార్టీ పెట్టబోతుందని వస్తున్న వార్తలు నిజమయ్యాయి.

# తెలంగాణ ప్రాజెక్టులకు అడ్డు చెప్పలే



**అమరావతి:** తాను తెలంగాణ ప్రాజెక్టులకు ఏనాడు అడ్డు చెప్పలేదని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఇవాళ గుంటూరు జిల్లాలో జరిగిన తెలుగు మహాసభలో ఆయన మాట్లాడా రు. గతేడాది సుమారు కృష్ణా, గోదావరి నదుల నుంచి 6,282 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి నీళ్లు పుష్కలంగా ఉన్నాయని అన్నారు. గోదావరి నీళ్లను తెలంగాణ వాడుకున్నా తాను ఏనాడు అడ్డు చెప్పలేదని స్పష్టం చేశారు. విభజన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినా అభ్యంత రం చెప్పలేదని అన్నారు. ప్రతి ఏడాది గోదావరి నుంచి సముద్రంలోకి మూడువేల టీఎంసీల నీళ్లు వృథాగా పోతున్నాయని చెప్పుకొచ్చారు. కృష్ణాగోదావరి నదులు అనుసంధానం జరుగుతుందని వెల్లడించారు. ఏపీలోని నదులన్నింటినీ అనుసంధానించాలని సూచించారు. కల్వకుర్తి లిఫ్ట్, ఏఎమ్మార్ ఎత్తిపోతల, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులను తాను పూర్తి చేశానని స్పష్టం చేశారు. కృష్ణా డెల్టా మోడరైజేషన్ పేరుతో నీటిని పొదుపు చేసి ఆ నీటిని తెలంగాణకు కేటాయించి బీమా లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేశామని వెల్లడించా రు. గోదావరి నదిపై గుత్ప, అలీసాగర్. దేవాదుల ఎత్తిపోతల వంటి పథకాలను చేపట్టామని వివరించారు. ఆంధ్ర ప్రాంతంలో చాగల్నాడు, పుష్కర, తాటిపూడి వంటి లిఫ్ట్ ప్రాజెక్టులు తీసు కువచ్చామని తెలిపారు. పట్టిసీమ ప్రాజెక్టుతో కృష్ణా డెల్టాకు నీరిచ్చామని అన్నారు. విభజన తర్వాత కేంద్ర ప్రభుత్వం పోలవరానికి ప్రత్యేక నిధులిచ్చిందని అన్నారు. తెలుగు ప్రజలకు రెండు రాష్ట్రాలున్నా... తెలుగే మాతృభాష అని తెలిపారు. రెండు రాష్ట్రాలు కలిసి ఉంటే ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నా రు. ఎన్టీఆర్ సీఎం అయ్యాకే.. సాగర్ జలాలను ఉపయోగించుకునేలా ఎస్ఎల్బీసీ, ఎస్ఆర్బీసీ ప్రాజెక్టులు తెచ్చారని ప్రస్తావించారు.

# ఆ మాట చెప్తేనే కదా కాంగ్రెస్‌లో చేరాం..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బీసీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఖర్చు చేయడం లేదని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న విమర్శించారు. బీసీల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని రూ.11 వేల 500 కోట్లు బీసీల కోసం బడ్జెట్ లో కేటాయించినా ఇంకా రూ.9 వేల కోట్లు ఖర్చు చేయలేదని ప్రశ్నించారు. మరో రెండు నెలల్లో కొత్త బడ్జెట్ అమల్లోకి రాబోతోందని మరి ఈ రెండు నెలల సమయంలో ఈ 9 వేల కోట్లు ఎలా ఖర్చు చేస్తారని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ స్టడీ సర్కిల్స్ కోసం రూ.50 కోట్లు కేటాయిస్తే ఇందులో ఖర్చు చేసింది కేవలం రూ.4 లక్షలు మాత్రమే, రాజీవ్ యువ వికాసం కింద రూ.4,102 కోట్లు బీసీ యువత కోసం ఖర్చు చేస్తామని చెప్పి రూ.13 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ లో ప్రతి యేడాది 20 వేల కోట్లు ఖర్చు చేస్తామని చెప్తేనే మేమంతా వచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరామని, బీసీలమంతా ఓట్లు వేశామన్నారు. ఐదేళ్లలో బీసీల కోసం కాంగ్రెస్ పార్టీ లక్ష కోట్లు ఖర్చు చేస్తామని చెప్పి నెరవేర్చే ప్రభుత్వమేనా ఇదేనా అని ప్రశ్నించారు.

**త్వరలో బీసీ ప్రజాప్రతినిధులతో సమావేశం: పొన్నం**

మల్లన్న ప్రశ్నకు సమాధానం ఇచ్చిన మంత్రి పొన్నం బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బీసీలకు చేసిన ఖర్చుల వివరాల విషయంలో ఇంకా కసరత్తు జరుగుతోందన్నారు. త్వరలోనే బడుగు బలహీన వర్గాల ప్రజాప్రతినిధులతో ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేయబోతోందన్నారు. బీసీలకు అన్యాయం చేయబోమన్నారు. విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

## సంపాదకీయం

# త్యాగాలకు చెరగని చిరునామా

భారతదేశం కోసం త్యాగాలు, బలిదా నాలు చేసిన జాతీయపార్టీ కాంగ్రెస్. నిన్న ఆదివారంతో 140 వసంతాలు పూర్తిచేసు కొని ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలి చిపోయిన పార్టీ. దేశం కోసం కాంగ్రెస్ నేతలు నాటి నుండి నేటి వరకు తమ ప్రాణాలను, ఆస్తులను తృణపాయంగా ఎంచి, త్యాగం చేశారు. దేశ స్వాతంత్ర్యోద్య మానికి పునాది వేసిన కాంగ్రెస్ స్వతంత్ర భారత్లో కూడా అంతే బాధ్యతతో దేశ పురోగతికి బాటలు వేసింది. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా 1885 లో ఆవిర్భవించిన పార్టీ... జాతి పిత మహాత్మా గాంధీ, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ వంటి ఉన్నత మైన నేతల మార్గదర్శకత్వంలో నడుస్తూ, దేశ ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తూ వచ్చింది. నేడు దేశంలో నిరంకుశ పాలనలో ఎదురవు తున్న సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటూ, ప్రజాస్వామ్యాన్ని పరిర క్షించాల్సిన బాధ్యత ప్రస్తుతం కాంగ్రెస్ భుజస్కంధాలపై ఉంది.

బ్రిటిష్ పాలకుల కబంధ హస్తాల నుండి దేశానికి విముక్తి కల్పించేందుకు 28 డిసెంబర్ 1885న స్థాపించిన కాంగ్రెస్ పార్టీ మహాత్మా గాంధీ సారథ్యంలో సహాయ నిరాకరణ, ఉప్పు సత్యా గ్రహం, క్విట్ ఇండియా వంటి మహత్తర ఉద్యమాలతో మన దేశా నికి స్వాతంత్ర్యం తీసుకొచ్చింది. ఆయన అడుగుజాడల్లోనే నెహ్రూ, వల్లభాయ్ పటేల్ దేశ భవిష్యత్తుకు బలమైన పునాదులు వేశారు. అహింసా మార్గాన్ని ఎంచుకున్న గాంధీజీ హింసను ప్రేరేపించే శక్తుల చేతిలో హత్యకు గురికావడం దేశానికే మచ్చ. దేశం కోసం నిత్యం పరిత పించే గాంధీ, నెహ్రూ, పటేల్ కలిసి కట్టుగా దేశప్రగతికి బాటలు వేయగా ఇప్పుడు బీజేపీ, దాని మాతృసంస్థ ఆర్.ఎస్.ఎస్ ఆ ముగ్గురి మధ్య విభేదాలున్నట్టు అసత్య ప్రచారం చేస్తున్నాయి. తొలి ప్రధాన మంత్రి నెహ్రూ పవిత్రమైన రాజ్యాంగాన్ని గౌర విస్తూ, అందుకు అనుగుణంగా సామ్యవాద పాలనతో దేశ ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించారు. ఆ బాటలోనే ఆయన కుమార్తె ఇందిరా గాంధీ కూడా సామ్యవాదానికీ, లౌకికవాదానికీ పెద్ద పీట వేసి, దేశాన్ని పరిపాలించారు. ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో ఆమె అణిచి వేస్తుండే సరికి, ఉగ్రవాద సంస్థలు ఆమెను పొట్టన పెట్టుకున్నాయి. అనంతరం ఆమె పెద్ద కుమారుడు రాజీవ్ గాంధీ కాంగ్రెస్ పై ప్రజలు చూసిన అభిమానాన్ని వమ్ము చేయకుండా 21వ శతాబ్దంలోకి దేశం పరుగులు తీసేలా, సాంకేతిక రంగానికి ప్రాధాన్యమివ్వడంతో ఆ టెక్నాలజీ ఫలాలను నేడు అనుభవిస్తున్నాం. దేశం కోసం మహాత్మా గాంధీ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ బలిదానాలు చేశారు. దేశం మొత్తం రాజీవ్ గాంధీ మరణానంతరం ఆయన సతీమణి సోనియా గాంధీ ప్రధాని కావాలని కోరినా ఆమె తిరస్కరించారు. అనంతరం తెలంగాణ బిడ్డ పి.వి.నరసింహా రావు నేతృత్వంలో కాంగ్రెస్ తీసుకొచ్చిన పలు సంస్కరణలతోనే నేడు దేశం ఆర్థికంగా పటిష్ఠస్థితిలో ఉంది. నాడు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటమికి ఛైర్పర్సన్గా ఉన్న సోనియా గాంధీ మార్గదర్శ కంలో మన్మోహన్ ప్రభుత్వం సమాచార హక్కు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం వంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంది. గాంధీ కలలు గన్న గ్రామస్వరాజ్యానికి అనుగుణంగా మన్మో హన్ సింగ్ మహాత్మా గాంధీ పేరున జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం తీసుకొచ్చి గ్రామల్లోని ప్రజలకు పని కల్పిస్తూ ఆర్థిక భరోసా కల్పించగా, ఇప్పటి మోదీ ప్రభుత్వం కాంగ్రెస్పై కక్షతో ఆ చట్టాన్ని నీరుగారుస్తోంది. ఉపాధి హామీ చట్టంలో గాంధీ పేరును తీసేసి, ఆ మహానుభావుడిని అవమానించడమే కాక, చట్టంలోని నిబంధనలు కూడా మార్చి పేదల కడుపు కొడుతోంది. ప్రజలకు ప్రభుత్వ యం త్రాంగం జవాబుదారీగా ఉండాలనే లక్ష్యంతో తీసుకొచ్చిన చరిత్రా త్మక సమాచార హక్కు చట్టాన్ని కూడా కుదేలు చేసింది. స్వయం ప్రతిపత్తి గల ఈడీ, ఐటీ, ఎన్నికల సంఘం లాంటి వ్యవస్థలను రాజ కీయ ప్రయోజనాలకు వాడుకోవడం విషాదం. అంతేకాదు నేటి పాలకులు విదేశాంగ వ్యవహారాల్లో, ఆర్థిక రంగంలో కూడా విఫల మవడమే కాక, దేశ ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడు తున్నారు. 'ఎవరెంతో వారికంత' సామాజికన్యాయం జరగాలనే రాహుల్ సంకల్పానికి అనుగుణంగా రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం కులగణన నిర్వహించింది. చివరకు జాతీయ స్థాయిలో తీవ్ర ఒత్తిడి రావడంతో కేంద్ర పాలకులు సైతం దేశ వ్యాప్తంగా కుల గణనకు అంగీకరించడం కాంగ్రెస్ సాధించిన నైతిక విజయం. దేశం లో త్యాగాలకు చెరగని చిరునామా అయిన కాంగ్రెస్ ఒకవైపు పార్టీ గత చరిత్రను స్ఫూర్తిగా తీసుకుంటూ, మరోవైపు నియంతృత్వ పాల కులను నిలదీసేందుకు మరింత ఉత్సాహంతో ముందడుగేస్తోంది.

# కాంగ్రెస్ సర్కార్ స్పెషల్ డ్రైవ్..



తెలంగాణ ప్రభుత్వ శాఖల్లో ఉన్న లీకులకు సీలేసే స్పెషల్ డ్రైవ్ చేపట్టింది కాంగ్రెస్ సర్కార్ . ఒక్కో డిపార్ట్ మెంట్ లో అనధికారికంగా పక్కదారి పడుతున్న ప్రభుత్వ సొమ్ముకు అడ్డుకట్ట వేసే పని మొదలైంది.ఇప్పటికే మైనింగ్ డిపార్ట్ మెంట్ లీక్స్ కు ఎమ్ సీల్ వేసేశారట. దాంతో ఈ ఏడాది ఏకంగా 22 శాతం ఆదాయం పెరిగిందని చెబుతున్నారు. ఇక ఆ ఇన్స్పిరేషన్ తో ఎక్కడెక్కడ ప్రభుత్వ ధనం వృధా అవుతోందో లెక్కలు తీసి పూర్తిగా కట్టడి చేయాలని నిర్ణయించారు ప్రభుత్వ పెద్దలు. అందులో భాగంగానే... అన్ని శాఖల్లో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఖ్యను తేల్చాలని డిసైడ్ అయ్యింది సర్కార్ .డిసెంబర్ 31 వరకు పూర్తి లెక్కలు తీస్తే... ఆ వివరాలు చూసి అంతా షాక్ తిన్నట్టు తెలుస్తోంది. దాదాపు 15వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు మిస్ అయినట్టు తెలుస్తోంది. వాళ్ళు ఎవ్వరూ అస్సలు ఆధార్ కార్డులు ఇవ్వలేదని సమాచారం. ఇన్నాళ్ళు వీళ్ళ పేరుతో జీతాలైతే డ్రా చేస్తున్నారుగానీ... గవర్నమెంట్ దగ్గర పూర్తి వివరాలు లేవు. ఈ డిటైల్స్ చూసి స్వయంగా ఆర్థిక శాఖ అధికారులే కంగుతిన్నట్టు తెలిసింది. ఈ క్రమంలో.... ఇంతకీ ఆ 15 వేల మంది ఉద్యోగులు ఎవరు..? నిజంగానే ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తుంటే... ఎందుకు సమాచారం ఇవ్వలేదు..? వాళ్ళ పేరుతో వేరే ఎవరైనా డబ్బులు డ్రా చేసి నొక్కేస్తున్నారా..? అనే చర్చ మొదలైంది సచివాలయవర్గాల్లో. గత పదేళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల వివరాలు సేకరించిన క్రమంలో ఈ అక్రమ చిట్టా బయటపడిందట. దాంతో.. కాంట్రాక్టు ఉద్యోగుల పేరుతో... డబ్బులు నొక్కింది ఎవరు..? అందులో అధికారుల పాత్ర ఉందా..? లేక రాజకీయ నాయకుల పాత్ర ఉందా అన్నది తేల్చే విషయంలో ప్రభుత్వ పెద్దలు సీరియస్ గా ఉన్నట్టు సమాచారం.ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున ముగిసిన వెంటనే ఇందుకు సంబంధించిన సమగ్ర నివేదికను ముఖ్యమంత్రికి అందించేందుకు అధికార వర్గాలు కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. బీఆర్ ఎస్ హయాంలో కాంట్రాక్టు ఉద్యోగుల పేరుతో దోపిడీ జరిగిందని, అన్నిటినీ బయటకు తీస్తామని గతంలో ప్రకటన కూడా చేశారు సీఎం రేవంత్ రెడ్డి. దానిపై ఆడిట్ చేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ లెక్కన 15 వేల మంది ఉద్యోగుల సంగతి ఏంటి..? వెనకాల ఉన్నది ఎవరు..!? అన్నది ఆసక్తికరంగా మారింది. ప్రభుత్వ విభాగాల్లో... 15 వేల ఉద్యోగాలంటే అదేం చిన్న విషయం కాదు. అందుకే దీనిపై సర్కార్ ఏం చేయబోతుంది..!? లెక్కలు సరిచేస్తారా..? వెనక ఉన్న వాళ్ళని బయటికి లాగుతారా అంటూ ఆసక్తిగా చూస్తున్నాయి తెలంగాణ రాజకీయవర్గాలు.

# భారత్ భావనకు 'విద్వేష' ఉపద్రవం

నూతన సంవత్సర శుభాకాంక్షలు. గతించిన సంవత్సరం (2025)లో మీ మనసుపై ముద్ర వేసిన ప్రభావం లేదా ఘటన ఏమిటి? శాశ్వతంగా నిలిచిపోయే దాని జ్ఞాపకాన్ని సువ్యక్తం చేసే పదం ఏమిటి? ఈ సువిశాల దేశంలో అత్యధిక ప్రజలను కదిలించిన మాట ఏమిటి? 2025 సంవత్సరం మనలో మిగిల్చిన మన్నికైన జ్ఞాపకం 'సిందూర్. పహల్గాంలో అమానుష ఉగ్రవాద దాడికి పాల్పడింది ముగ్గురు పాకిస్థానీ చొరబాటు దారులు. ఈ పాకిస్థానీ దుండగులకు ఆశ్రయమిచ్చి,వారి ఘాతుకానికి సహక రించినది ఇద్దరు భారతీయులు అని నేషనల్ ఇన్వెస్టి గేషన్ ఏజెన్సీ వెల్లడించింది. పహల్గాం హత్యా కాండకు భారత ప్రభుత్వ ప్రతిస్పందనే 'ఆపరేషన్ సిందూర్. ఈ సైనిక చర్యలో భారత వాయుసేన, క్షిపణులు, డ్రోన్లు పాకిస్థాన్ సైనిక స్థావరాలకు తీవ్ర నష్టం కలిగించాయి. మన దేశానికీ కొంత నష్టం సంభవించింది (ఏ యుద్ధంలోనైనా ఇది అనివార్యం). ముగ్గురు పాకిస్థానీ చొరబాటుదారులు ఒక ఎన్ కౌంటర్లో హతమయ్యారు. ఎన్ఐఏ అరెస్ట్ చేసిన ఇద్దరు భారతీయుల వివరాలు ఇంకా వెల్లడి కాలేదు. ఆపరేషన్ సిందూర్ నిర్వహణ, సాధించిన ఫలితాలపై ఇప్పటికీ పారదర్శకత కొరవడింది. కేవలం నాలుగు రోజులు మాత్రమే జరిగిన 'ఆపరేషన్ సిందూర్ దేశ ప్రజల మనసులపై శాశ్వత ప్రభావం కలిగించేంత సుదీర్ఘ యుద్ధం కాదు. 2025లో భారత్ను నిర్వచించేందుకు యుక్తమైన మరో పదం 'టారిఫ్'. ఆ సేతు హిమాచలం అశేష ప్రజల మాటామంతీ, పిచ్చాపాటీలో ప్రస్తావితమైన, ఇంకా ప్రస్తావితమవుతోన్న పదమది. దానికి దీటైన మరొక 'సమీప భవిష్యత్తు'లో కుదరనున్నదని 2025 ఏప్రిల్లో వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్ ప్రకటించారు. 2025 సంవత్సరం ముగిసిపోయింది. ఇప్పటికీ ఆ ఆశావహ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చాలా సుదూర విషయం గానే కనిపిస్తోంది మరి.

జీఎస్టీ (వస్తు సేవల పన్ను) మరొక యుక్తమైన పదంగా చెప్పవచ్చు. ఎనిమిది సంవత్సరాల క్రితం ఈ పన్ను వ్యవస్థ ప్రారంభమయింది. వినియోగదారులకు, వ్యాపార వర్గాలకు ఆదొక ఉపద్రవం. సముచిత సలహాలు, సూచనలకు కేంద్ర ప్రభుత్వం ఆలస్యంగానే అయినప్పటికీ సానుకూలంగా ప్రతి స్పందించింది. చాలా సరుకులు, సేవలపై జీఎస్టీ రేట్లను హేతుబద్ధీక రించింది అయినప్పటికీ వర్తకులు, వ్యాపారులు, వాణి జ్యవేత్తలకు పాలనా యంత్రాంగాల నుంచి వేధింపులు, చికాకులు తప్పడం లేదు. కొంతమంది వ్యాపారులు అయితే ఇప్పటికీ జీఎస్టీ విషయంలో తికమక పడుతూనే ఉన్నారు. జీఎస్టీ చట్టాలకు అనుగుణంగా వ్యవహరించడంలో తమకు ఎదురవుతున్న కష్ట నష్టాలకు వర్తకులు, వ్యాపారులు ఎంతో మంది గుండెలు బాదుకుంటూనే ఉన్నారు. కొన్ని ముఖ్యమైన సరుకులపై పన్ను రాయితీ కల్పించారు. అయితే వాటి వినియోగ పరిమాణంతో పోల్చితే ఆ రాయితీ చాలా స్వల్పమైనది మాత్రమే. జీఎస్టీపై ఇచ్చిన రాయితీలతో వినియోగం ఇతోధికంగా పెరుగుతుందని ప్రభుత్వం భావించింది. అయితే దేశ జనాభాలో అధిక ఆదాయమున్న పదిశాతం ప్రజల వినియోగం మాత్రమే పెరిగింది. చెప్పవచ్చిన దేమిటంటే జీఎస్టీ ఇప్పటికీ సామాన్య విని యోగదారులకు చికాకు కలిగిస్తూనే ఉన్నది.

2025 సంవత్సరం భారత ఆర్థిక వ్యవస్థకు పదం 'ట్రంప్' మాత్రమే! ట్రంప్ టారిఫ్లు అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలను సంక్లిష్ట సమస్యల్లోకి నెట్టివేశాయి. చాలా దేశాల్లో ఈ సమస్యలు ఇంకా ఒక కొలిక్కి రాలేదు. ఉదాహరణకు అమెరికాకు భారత్ ఎగుమతులపై ప్రతీకార సుంకాలు, రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు జరిమానా విధింపులు కొనసాగు తున్నాయి. అమెరికాకు భారత్ చేస్తున్న- ఉక్కు, అల్యూమినియం, జాళి ఉత్పత్తులు, ముత్యాలు, ఆభరణాలు, సముద్ర ఆహార ఉత్పత్తులు, రసాయనాల ఎగుమతులను ట్రంప్ సుంకాలు ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నాయి. అమెరికా, భారత్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం 'Goldilocks year' ((స్థిరమైన, మితమైన వృద్ధి. తక్కువ ద్రవ్యోల్బణం, తక్కువ నిరుద్యోగంతో ఆర్థిక వ్యవస్థ వర్థిల్లిన అరుదైన సంవత్సరం) అని ప్రభుత్వం ఆర్భాటంగా చాటింది. అయితే ఈ ప్రచారార్భాటం చాలా త్వరితంగానే అంత రించిపోయింది. ఆ ఘనమైన మాట-గోల్డిలాక్స్ ఇయర్ సూచించే విషయాలు విద్యాదికులకే అపరిచితమైనవి. దీనికి తోడు దేశ జాతీయ గణాంకాల విశ్వసనీయతను అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎమ్ఎఫ్) సంస్థ ప్రశ్నించింది. దేశ ఆర్థిక వ్యవస్థ బలహీనతల గురించి మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు మొదలు అర్థశాస్త్ర ఘనాపాఠీలు అయిన విశ్వవిద్యాలయాల ఆచార్యుల వరకూ ఎందరో మాట్లాడారు. అయితే ఉద్యోగాలకై యువజనులు చేసిన ఆందోళనలతో ప్రభుత్వ ప్రాయోజిత 'గోల్డిలాక్స్ ఇయర్' ప్రచారం నిలిచి పోయింది. నిజానికి ప్రధాన ఆర్థిక మాజీ సలహాదారు, తదితరులు చెబుతున్న వాటికంటే చాలా బలహీనతలు దేశ ఆర్థిక వ్యవస్థలో ఉన్నాయి. వాటిని అంగీకరిం చేందుకు ప్రభుత్వం తిరస్కరిస్తోంది. ఇంకా చెప్పాలంటే... బహుశా, ఆ బలహీనతలను అర్థం చేసు కునేందుకు సైతం ప్రభుత్వం నిరాకరిస్తోంది. సరే, ఒకప్పుడు అందరూ 'లౌకికవాదం' అనే పదాన్ని ప్రస్తా విస్తుండేవారు. లౌకికవాద విలువల గురించి మాట్లాడు తుండేవారు. అయితే ఇప్పుడు ఆ పదం ఎక్కడా విన్పించడం లేదు. తమనుతాము లౌకికవాదులుగా చెప్పుకునే వారి సంఖ్య అంతకంతకూ తగ్గిపోతోంది. రాజ్య వ్యవస్థ కార్యకలాపాల నుంచి మత ప్రమేయ వ్యవ హారాలను వేరు చేయడమే లౌకికవాదం. అయితే మత సిద్ధాంతాలపై కాకుండా హేతువు, మానవతా వాదంపై లౌకికవాది విలువలు ఆధారపడి ఉంటాయనే అర్థాన్ని ఆ పదం కాలక్రమేణా సంతరించుకున్నది.. లౌకికవాద విలువల, విశ్వాసాల తిరోగమనం విద్వేషం ప్రబలిపో యేందుకు దారితీసింది. ప్రతి మతమూ గర్హించిన మానవ స్వభావమది. విద్వేష ప్రసంగాలు, విద్వేష రచనలుగా చెప్పదగిన వాటిలో అత్యధికం మతం ఆధా రితమైనవి. జాతి, భాష, కులం కూడా చాలా మందిలో విద్వేష వైఖరులకు ఆధారంగా ఉన్నాయి. విద్వేష వైఖ రులకొక స్పష్టమైన తార్కాణం ముస్లింల పట్ల ద్వేషం. వారి వస్త్రధారణ, ఆహార అల అలవాట్లు,ప్రార్థనా ప్రదేశాల పట్ల ఇతరుల్లో వ్యతిరేకత పెరుగుతోంది. ఈ కారణంగానే ముస్లింల 'నమాజ్' (ప్రార్థన)కు అంతరాయం కలిగించడం, ఆ మతాచారాలపై ఆంక్షలు విధించడం జరుగుతోంది. తోటి భారతీయులు అయిన ముస్లింల పట్ల ఇలా ఎందుకు వ్యతిరేకత ప్రబలిపోతోంది? సుదూర ప్రాంతాలకు చెందిన ముస్లింలు భారత్ను దురాక్రమించి ఆరు శతాబ్దాల పాటు పరిపాలించారని, ముస్లింలకు ఈ దేశంలో వారి స్థానమేమిటో చూపే సమయం ఇప్పుడు ఆసన్నమయిందని, హిందువులు ఆ అవకాశాన్ని విని యోగించుకుంటున్నారని... ముస్లింలను ద్వేషించే పలువురు వాదిస్తున్నారు. ఇది పూర్తిగా తప్పుదోవ పట్టించే వాదన, సందేహం లేదు. ముస్లింల మీదే కాదు, మరో మైనారిటీ మతమైన క్రైస్తవం పట్ల కూడా ఆగ్రహం ప్రచండంగా వ్యక్తమవుతోంది. క్రైస్తవ ప్రార్థనా మందిరాలను ధ్వంసం చేస్తున్నారు. క్రైస్తవ పూజారులు, మతాచార్యులు, క్రైస్తవ ధర్మ ప్రచారకులను హతమారు స్తున్నారు. జీసస్ స్తుతి గీతాలు గానం చేస్తున్న క్రైస్తవ బాలలపై దాడులు జరుగుతున్నాయి. ఈ ఆగడాలన్నీ హిందూ 'హక్కుల'ను రక్షించడం పేరిట జరుగు తున్నాయి! హిందూ మత ఆధిపత్య భావనను ఏవగించుకు న్నంతగా మరే భావనను భారత రాజ్యాంగం అస హ్యించుకోదు, వ్యతిరేకించదు. భారత్ భావన (ఐడియా ఆఫ్ ఇండియా)కు పునాది పౌరసత్వమే కానీ మతం ఎంత మాత్రం కాదు. అలాగే కులం లేదా జాతి లేదా భాష కూడా భారతీయ భావనకు ప్రాతిపదికలు కావు. భారతీయులలో అత్యధికులు డాక్టర్ అబ్దుల్ కలాం, మదర్ థెరిస్సా ఉదాత్త జీవితాల నుంచి స్ఫూర్తి పొందుతున్నారు. వారిని పూజ్యభావంతో స్మరించుకోవడం తమ భారతీ యతకు చిహ్నంగా విశ్వసిస్తున్నారు. ముస్లింలు, క్రైస్తవులకు వ్యతిరేకంగా విద్వేషాన్ని రగిలించి వ్యాపింప జేస్తున్న భారతీయుల సంఖ్య చాలా చాలా స్వల్పం.ఈ విద్వేష పర్వంలో అత్యంత ఆందోళనకరమైన విషయం మైనారిటీ మతాల వారిపై దాడులను శాసన సమ్మతం చేసే ప్రయత్నమే. రాజ్య వ్యవస్థ, ఉన్నత పదవులలో ఉన్న నాయకులు, ప్రభుత్వాల అండదండలతో పెట్రేగి పోతున్న కొన్ని సంఘాలు ఈ రాజ్యాంగ విరుద్ధ చర్యలకు ప్రధాన బాధ్యులు. వారి మాటలు, చేతలు లేదా మౌనం విద్వేషకారులు చెలరేగిపోయేందుకు ప్రోత్సాహమిస్తున్నాయి. ఆ విద్వేష దాడులు మానవతను కాలరాసివేసేవే. ఈ ధోరణి కొనసాగడం భారతీయ సమాజానికి చేటుచేస్తున్నది. భారత గణతంత్ర రాజ్య వ్యవస్థాపకులు ఏది జరగకూడదని సంకల్పించారో అదే సంభవిస్తున్నది. సంకుచితత్వాల ఇరుకు గోడల మధ్య మన మహోన్నత పురానవజాతి మరొకసారి ముక్కలు ముక్కలయి పోగలదు. ఈ అరిష్టం సంభవించకుండా అడ్డుకోవడం భారతీయ పౌరుల విధ్యుక్త ధర్మం. ఆవేదన, ఆగ్రహం, అమితమైన వ్యాకులత, అంతకు మించిన తలవంపులతో గతించిన సంవత్సరం (2025)లో భారతదేశాన్ని నిర్వచించే పదంగా 'విద్వేషం'ను ఎంచుకున్నాను.

# వరంగల్ లో కొండా వర్సెస్ సారయ్య





ఓరుగల్లు తూర్పు వార్ ముదిరిందా? పొలిటికల్ పోరులో పోలీస్ అఫీసర్స్ బలవబోతున్నారా? తాజా పరిణామాలు ఏం చెబుతున్నాయి? ఎత్తుకు పై ఎత్తుల రాజకీయంలో ఎవరు ఇరుక్కోబోతున్నారు? వేరు కుంపట్లు లోకల్ కాంగ్రెస్ ను ఎటువైపు తీసుకెళ్తున్నాయి? మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో అసలేం జరుగుతోంది? తెలంగాణ మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ లో ఇప్పటికే ఉన్న వేరు కుంపట్లు ఇప్పుడు గట్టిగా రాజుకుంటున్నాయి. కొండా అనుచరుడు నల్లగొండ రమేశ్ తాజాగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య గూటికి చేరడంతో ఒక్కసారిగా పొలిటికల్ హీట్ పెరిగింది. మంత్రి సురేఖ భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, సారయ్య మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరినట్టు కనిపిస్తోంది.కొద్దినెలల కిత్రం పోచమ్మమైదాన్ సెంటర్లో డబ్బాల తొలగింపు వివాదంలో కొండా మురళి బాహాటంగానే సారయ్యను సవాల్ చేశారు. అప్పటి నుంచి మొదలైన మధ్య విభేదాలు..అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. వాస్తవానికి కొండా దంపతులు, బస్వరాజ్ సారయ్య మధ్య ఆధిపత్య పోరు ఇప్పటిది కాదు. ఒకే పార్టీలో ఉన్నా ఎప్పుడూ కీచులాటలే. మరో వైపు నియోజకవర్గంలో కొండా దంపతులకు పోలీసులు విచ్చలవిడిగా సహకరిస్తున్నారంటూ సారయ్య తప్పు పడుతున్నారు. లోకల్ పోలీసులు వాళ్ళ డ్యూటీ చేయకుండా కొండా మురళి చెప్పినట్టు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు ఎమ్మెల్సీ. మిల్స్ కాలనీ, ఇంతేజార్ గంజ్, మట్టెవాడ పోలీస్ స్టేషన్లలో అనేక అక్రమాలు జరుగుతున్నాయంటూ ఆ మధ్య ఎమ్మెల్సీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం కలకలం రేపింది.అలాగే... రాజకీయ వత్తిళ్ళతో అమాయక ప్రజలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు సారయ్య. దీనిపై విచారణ జరిపిన ఉన్నతాధికారులు అక్రమ కేసులు నిజమేనని తేలడంతో ఒక ఏసీపీ, ముగ్గురు అధికారులను సస్పెండ్ చేశారు. ఇక ఓ పాత కేసులో పోలీసులు సరిగా దర్యాప్తు జరపడం లేదంటూ.. సారయ్య తాజాగా డీజీపీని కలిసి ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఖిల్లా వరంగల్ లో తొమ్మిది నెలల క్రితం జరిగిన గొర్రెల దహనం ఘటనపై పోలీసులు స్పందిస్తున్న తీరును తప్పుపడుతున్నారు ఎమ్మెల్సీ. దుగ్గిరాల లక్ష్మణ్ కుటుంబానికి చెందిన సుమారు 300 గొర్రెలు సజీవ దహనమై తొమ్మిది నెలలు గడిచినా పోలీసులు నిందితులను పట్టుకోలేదన్నది సారయ్య ఫిర్యాదు. దానికి సంబంధించి కేసైతే పెట్టారుగానీ.. ఎలాంటి పురోగతి లేదని, వరంగల్ పోలీసులు మురళికి అనుకూలంగా వ్యవహరించడమే అందుకు కారణం అన్నది ఎమ్మెల్సీ డౌట్ . అలాగే... గ్రేటర్ వరంగల్ కార్పొరేటర్లు గుండేటి సురేంద్ర కుమార్, మరుపల్ల రవి, సురేష్ కుమార్ జోషి మీద కావాలనే తప్పుడు కేసులు బనాయిస్తున్నారంటూ డీజీపీ దృష్టికి తీసుకెళ్ళారట సారయ్య.ఈ క్రమంలో కొందరు లోకల్ పోలీసు అధికారుల్లో మళ్ళీ టెన్షన్ మొదలైందట. మరోవైపు ఇన్నాళ్లు కొండా దంపతులకు ప్రధాన అనుచరుల్లో ఒకరిగా ఉన్న నల్లగొండ రమేష్ ఇప్పుడు ఎమ్మెల్సీ వర్గంలో చేరడంతో... సమీకరణలు మారవచ్చంటున్నారు. అలాగే... వరంగల్ డీసీసీ కొత్త అధ్యక్షుడు అయూబ్ కూడా బస్వరాజు వర్గంలో చేరడంతో... ఓరుగల్లు తూర్పు యుద్ధం ముదిరిన సంకేతాలు కనిపిస్తున్నాయి. అదే సమయంలో రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవని, తప్పుడు పనులు చేసే అధికారులకు శిక్ష తప్పదని ఎమ్మెల్సీ సారయ్య హెచ్చరిస్తుండటం హీట్ పెంచుతోంది. తన పాత వినతులపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలను కూడా వెంటనే వెల్లడించాలని పోలీస్ ఉన్నతాధికారులను కోరారు ఎమ్మెల్సీ. ఈ రాజకీయ ఆధిపత్య పోరు మళ్లీ పోలీస్ డిపార్ట్ మెంట్ లో ఎవరికి చుట్టుకుంటుంది? ఎన్ని మలుపులు తిరుగుతుందోనని ఆసక్తిగా గమనిస్తున్నారు పొలిటికల్ పండిట్స్ .

# బ్యాలెట్ పేపర్‌తోనే మున్సిపల్ ఎన్నికలు!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలను బ్యాలెట్ పేపర్ తోనే నిర్వహించాలని, అందుకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచనాప్రాయంగా ఆదేశాలు అందినట్లు సమాచారం. అయితే, 2014లో ఈవీఎంలతో, 2020లో కరోనా కారణంగా బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సారి కూడా ఈవీఎంలతో నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ, బ్యాలెట్ వైపే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఈవీఎంలపై కొంతమంది రాజకీయ నాయకులు, ప్రజల్లో ఉన్న అపనమ్మకం ఒక కారణమైతే, బ్యాలెట్ తో ఎన్నికలు నిర్వహించడం సులభం, పారదర్శకత ఎక్కువగా ఉంటుందనే అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చినట్లు తెలుస్తోంది. అయితే, అధికారికంగా రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి ఈ అంశంపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

**హోరాహోరీ పోరు తప్పదా..**

కాగా, మరోవైపు తుది ఓటర్ల జాబితా జనవరి 10న ప్రచురణకు ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జనవరి 1న ముసాయిదా ఓటర్ల జాబితా కూడా విడుదలైంది. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఈ నెల చివర్లో లేదా ఫిబ్రవరి మొదటి వారంలో షెడ్యూల్ విడుదల కానుందని జోరుగా ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్లలో ప్రత్యేకాధికారి పాలన కొనసాగుతోంది. ఇక, పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ Congress పార్టీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకున్న నేపథ్యంలో, మున్సిపల్ ఎన్నికల్లో తమదే విజయమని ఆత్మవిశ్వాసంతో కదనరంగంలోకి దిగుతోంది. బీఆర్ఎస్ , బీజేపీ వంటి ప్రతిపక్షాలు ఇప్పటికే పట్టణ ప్రాంతాల్లో కాస్త బలం పుంజుకున్న తరుణంలో ఈ ఎన్నికలు హోరాహోరీగా జరిగే అవకాశం ఉందని రాజకీయ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# భూమిని మింగిన బకాసురుడు..!

**నారాయణ ఖేడ్,ఫ్లాష్ ఇండియా :** పట్టణానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోతోంది. పెద్ద శంకరంపేట ఆనుకొని ఉన్న తిరుమల పూర్ సమీపం ఎర్ర కుంట శిఖం భూమిని, అసైన్డ్ భూములకు అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు. ప్రభుత్వ భూములను రక్షణ కల్పించవలసిన అధికారులు అటువైపు చూడకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి అక్రమాలకు గురవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**రూ.50 కోట్ల విలువ చేసే భూముల పై స్కెచ్..**

పెద్ద శంకరంపేట మండలంలోని తిరుమలాపూర్ రెవెన్యూ పరిధికి చెందిన సర్వే నెంబర్ 258 లో 2 ఎకరాల 27 గుంటలు, అసైన్డ్ భూమి సర్వే నంబర్ 1 లో 19 ఎకరాల 20. 20 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. సుమారు 13 ఎకరాలపై విలువైన ప్రభుత్వ భూమిపై కొందరు అక్రమార్కులు కన్ను పడింది. ఆ భూమిని కబ్జా చేసి చేశారు. అక్రమ నిర్మాణాలు చేపడుతూ గుట్టు చప్పుడు కాకుండా ప్లాట్లు అమ్ముకొని నిర్మించుకుంటున్నారు. ఈ వ్యవహారంపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసిన నామమాత్రమైన చర్యలు తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు అక్రమ నిర్మాణాలను నామమాత్రంగా కేసులు కొందరు పైనే పెట్టి, మిగతా వారిపై ప్రేమ చూపిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.దర్జాగా భూమిలో కొందరు అక్రమార్కులు అధికారులతో చేతులు కలిపి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఇది రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ అధికారి, పంచాయతీ అధికారుల అండదండలతో భూములను అన్యాక్రాంతం గురైందని స్థానికులు అంటున్నారు.భూములకు రెక్కలు రావడంతో గత ప్రభుత్వంలో ఉన్న అక్రమార్కులు ఈ భూమిపై కన్నేశారు. నిరుపేదలకు అందవలసిన భూములను బడా బాబుల గుప్పిట్లో చేరింది. రెవెన్యూ, ఇరిగేషన్ , పంచాయతీ అధికారులు కుమ్మక్కె ఈ దందా కొనసాగుతోంది. భూమిని కొందరికి ప్లాట్లను చేసి అమ్ముకొని కోట్లల్లో దందా కొనసాగుతోంది. ఎర్రకుంట శిఖం భూమి పశువులు, పక్షులతో ప్రకృతితో కలకలలాడవలసిన రైతులకు సాగునీరు అందించవలసిన కబ్జాకు గురై భవంతులు వెలిశాయి.తిరుమలాపూర్ నుంచి మెదక్ జిల్లా కలెక్టర్ వరకు తెలిసిన ఈ భూముల గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. పట్టణం నడి ఒడ్డున భూ దందా జరుగుతుంటే నోరు మెదుపడం లేదని, కింది స్థాయి అధికారుల నుంచి పై స్థాయి అధికారుల వరకు అండదండలు ఉన్నాయని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ , ఇరిగేషన్, పంచాయతీ అధికారులు చుట్టపు గా వచ్చి వెళ్ళిపోతున్నారే తప్ప భూమి గురించి పట్టించుకున్న దాఖలు లేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చెందుతున్నారు.

**ఎర్రకుంట కబ్జా..**

మండల కేంద్రమైన పెద్ద శంకరంపేట ఆనుకొని ఉన్న తిరుమలాపూర్ లో వెంచర్ ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమి రిజిస్ట్రేషన్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా కుంటలోనే పద్మాలయా ఆసుపత్రిని నిర్మించారు. విద్యుత్ అధికారులు ట్రాన్స్ఫర్ కూడా మంజూరు చేశారు. కుంట చుట్టుముట్టు ఉన్న రెండు ఎకరాల 20 గుంటలో ఇండ్లు నిర్మించుకున్నారు. ఇందులో 8 మంది పైనే కేసు నమోదు చేశారు. మిగతా మందిని కేసులు చేయకుండా అధికారులు చేతులు దులుపుకున్నారు. ఉత్తులూరు గ్రామానికి చెందిన దొరల వద్ద మండల కేంద్రమైన పెద్ద శంకరంపేట వ్యక్తి అసైన్డ్ భూమి సర్వే నెంబర్ 1 లో 19 ఎకరాల 20 గుంటల భూమిని కొన్నారని సమాచారం. మోడల్ స్కూల్ 5 ఎకరాలు ఉన్నప్పటికీ కొంత భూమి నేషనల్ హైవే రోడ్ లో భూమి పోయింది.కస్తూర్బా గాంధీ విద్యాలయం కు 2 ఎకరాలు, బిసి హాస్టల్ కు 1 ఎకరం ఇచ్చినప్పటికీ మిగిలిన 11 ఎకరాల 20 గుంటల భూమి ఉండాలి. నేషనల్ హైవే పక్కన వెంచర్ ఏర్పాటు చేసినప్పటికీ నేషనల్ హైవే రోడ్డులో మూసివేయడంతో పిల్ల తోవ్వ ఉన్న రోడ్డును వెంచర్ కోసం కు 40 ఫీట్లు రోడ్డు వేసి బిల్లును కూడా తీసుకున్నారు. మిగిలిన భూమిని మొత్తం అన్యాక్రాంతమైనది. అధికారుల అండదండలతో గుంటల చొప్పున భూములను అమ్ముకున్నారు. భవనాలను నిర్మించారు. తన అధికారం పోయిన స్థానిక యంత్రంగా, ఇక్కడి ప్రజాప్రతినిధుల అండతో కబ్జా చేసి భూములను పార్టీలను ఫిరాయించి చేజారకుండా జాగ్రత్త పడ్డారు. తెలంగాణ ప్రభుత్వం హైడ్రా ఏర్పాటు కావడం, ప్రైవేటు బిల్డింగ్ లను ఫిర్యాదులతో నేలకూరుస్తారా..? హైడ్రా వర్తిస్తుందా లేదా.. వేచి చూడాలి మరీ.

# బీఆర్ఎస్‌లో అంతర్గత పోరు..

- కేటీఆర్‌పై విరుచుకుపడ్డ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య
- కేటీఆర్ మాట్లాడుతుంటే సిగ్గేస్తుంది బీఆర్ఎస్‌లో అంతర్గత
- కుమ్ములాటలు జరుగుతున్నాయని ఆరోపణ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ప్రభుత్వ విప్ , కాంగ్రెస్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. త్యాగాల కుటుంబమైన రాహుల్ గాంధీ కుటుంబంపై కేటీఆర్ మాట్లాడుతుంటే.. సిగ్గేస్తోందని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీపై అనుచితంగా, అహంకారంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీని ఉరి తీయాలంటూ బలుపుతో మాట్లాడటం దారుణమని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాసమస్యలపై అసెంబ్లీలో చర్చించాల్సిన సమయంలో కేటీఆర్ సహా బీఆర్ ఎస్ నేతలు చర్చకు రాకుండా పారిపోయారని బీర్ల ఐలయ్య విమర్శించారు.రాజకీయంగా మాజీ సీఎం కేసీఆర్ పని అయిపోయిందని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ ఎస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు జరుగుతున్నాయని ఆరోపించారు. పార్టీ అధ్యక్ష పదవి కోసం హరీష్ రావు, కేటీఆర్ మధ్య పోటీ నడుస్తోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది ప్రజలకు ఇప్పటికే అర్థమవుతోందన్నారు. సోనియా గాంధీ దయ వల్లనే కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారని, కేటీఆర్ మంత్రి పదవి పొందారని వ్యాఖ్యానించారు. ముందుగా కవిత చేసిన వ్యాఖ్యలపై, మీపై చేసిన ఆరోపణలపై సమాధానం చెప్పాలని కేటీఆర్ ను డిమాండ్ చేశారు. కేటీఆర్ మాటలను అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరిస్తూ.. రాహుల్ గాంధీ కుటుంబంపై మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే ప్రజలు స్పందించే రోజులు వస్తాయని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో మరోసారి రాజకీయ వేడి పెంచాయి.

# మహిళా సాధికారత, సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం!

- మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుపై మంత్రి సీతక్క సమాధానం
- మహిళా సాధికారత, సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం
- మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం నిరంతరం కృషి



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** అసెంబ్లీలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సీతక్క సమాధానం ఇచ్చారు. మహిళా సాధికారత, సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేశామని మంత్రి సీతక్క గుర్తు చేశారు. ఇది మహిళలకు భద్రతతో పాటు ఆర్థికంగా ఉపశమనాన్ని కలిగించే కీలక నిర్ణయమని పేర్కొన్నారు. మహిళల రోజువారీ జీవనాన్ని సులభతరం చేయడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు.ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి సీతక్క చెప్పారు. మహిళలు స్వయం ఉపాధి సాధించేందుకు అవసరమైన అవకాశాలు, వనరులు కల్పిస్తూ వారి ఆర్థిక బలాన్ని పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. రాష్ట్రంలోని ప్రతి మహిళ స్వయం సహాయక సంఘం (SHG) సభ్యురాలిగా ఉండాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. 15 సంవత్సరాలు దాటిన బాలికల నుంచి వృద్ధ మహిళల వరకు అందరినీ మహిళా సంఘాల్లో సభ్యులుగా చేర్చుతున్నామని తెలిపారు. ఈ విధంగా మహిళలందరినీ ఒక వ్యవస్థలోకి తీసుకువచ్చి అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యమన్నారు. అదేవిధంగా కిశోర బాలికలు, వృద్ధులు, దివ్యాంగ మహిళల కోసం ప్రత్యేక మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. వీరి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి.. వారికి ఆర్థిక, సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

**త్వరలో యాదగిరిగుట్ట వద్ద క్యాంటీన్:**

తెలంగాణలో ఎక్కువ మంది దర్శించుకునే యాదగిరిగుట్ట వద్ద మహిళా సంఘాల చేత క్యాంటీన్ తో పాటు ఇతర దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తామని సీతక్క వెల్లడించారు. జిల్లా కలెక్టర్ నుంచి ప్రతిపాదనలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోని మహిళలు మహిళా సంఘాల్లో చేరాలని పిలుపునిచ్చారు.

# ఈసారి బడ్జెట్ ఎప్పుడు?



**ఢిల్లీ :** ప్రతి ఏడాది ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టడం ఆనవాయితీ. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టే పద్ధతిని 2017లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఈ సాంప్రదాయం కొనసాగుతూ వస్తుంది. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి 1 (ఆదివారం) వచ్చింది. అయితే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సాంప్రదాయం ప్రకారం ఫిబ్రవరి 1నే ప్రవేశపెడతారా? లేదంటే ఫిబ్రవరి 2కు మారుస్తారా? అన్నది సందిగ్ధం నెలకొంది. అరుణ్ జైట్లీ తీసుకొచ్చిన పద్ధతి ప్రకారం ఆదివారమే నిర్మలమ్మ బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై కేంద్ర పెద్దలు గానీ.. నిర్మలమ్మ గానీ ఇంకా స్పష్టత ఇవ్వలేదు.ఇక 2026 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ అంచనా రూ.11 లక్షల కోట్ల వరకు ఉంటుందని తెలుస్తోంది. మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్ లకు పెద్ద పీట వేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. అంతేకాకుండా ఈ ఏడాది తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అస్సాం, కేరళలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఈ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ ఉండొచ్చని కూడా వార్తలు వినిపిస్తున్నాయి. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా నిర్మలమ్మ బడ్జెట్ ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.ఇక 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మారాలనే లక్ష్యంలో కేంద్రం అడుగులు వేస్తోంది. ఆ దిశగా కూడా బడ్జెట్ రూపొందించినట్లు సమాచారం. రాబోయే బడ్జెట్ లో తగిన వనరులను కేటాయించే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ఇక రాబోయే బడ్జెట్ సెషన్ లో ప్రభుత్వం విత్తన బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

## శాసనమండలిలో ఇదే నా చివరి ప్రసంగం



- శాసనమండలిలో ఎమ్మెల్సీ కవిత కంటతడి
- తన రాజకీయ ప్రస్థానం గురించి చెబుతూ ప్రసంగం మధ్యలో కంటతడి
- ఎమ్మెల్సీ పదవికి రాజీనామాపై కవిత వివరణ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** శాసనమండలిలో ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్ర భావోద్వేగం చెందారు. తన రాజకీయ ప్రస్థానం గురించి చెబుతూ ప్రసంగం మధ్యలో కంటతడి పెట్టారు. 8 ఏళ్లుగా ప్రజల కోసం తాను చేస్తున్న ప్రయత్నాన్ని అడ్డుకున్నారన్నారు. పార్టీ మౌత్ పీస్‌గా ఉన్న ఛానెళ్లు, పేపర్లు తనకు ఏనాడూ మద్దతు ఇవ్వలేదన్నారు. తాను ప్రశ్నిస్తే మాజీ సీఎం కేసీఆర్ వెంట ఉండే కొందరు వ్యక్తులు కక్ష గట్టారని చెప్పారు. బీఆర్ఎస్‌లో మొదటి నుంచి తనపై ఒత్తిళ్లు ఉన్నాయని శాసనమండలిలో ఎమ్మెల్సీ కవిత భావోద్వేగ ప్రసంగం చేశారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామాపై కవిత వివరణ ఇచ్చారు.శాసనమండలిలో కవిత మాట్లాడుతూ... 'నా రాజీనామాను ఆమోదించాలని కోరుతున్నా. తెలంగాణ జాగృతిని స్థాపించి ఉద్యమంలోకి వచ్చాను. బీఆర్ఎస్‌లో చేరిక ముందే జాగృతిని స్థాపించా. తెలంగాణ కోసమే ఉద్యమంలోకి వచ్చా. 8 ఏళ్లుగా ప్రజల కోసం నేను చేస్తున్న ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. బీఆర్ఎస్‌లో మొదటి నుంచి నాపై ఒత్తిళ్లు ఉన్నాయి. ప్రశ్నిస్తే నాపై కక్ష కట్టారు కేసీఆర్ వెంట ఉండే కొందరు వ్యక్తులు. ప్రభుత్వంలో అవినీతిని ప్రశ్నిస్తూ వచ్చాను. కలెక్టరేట్లు కట్టిన రెండు నెలలకే కూలాయి. అమర దీపం నిర్మాణంలో అవినీతి జరిగింది. నేను ప్రజల గురించి, సమస్యల గురించి చెప్పిన విషయాలను ఎవరూ పట్టించుకోలేదు' అని అన్నారు.భావోద్వేగాలు మధ్య రాజీనామా చేయడం సరైంది కాదని, రాజీనామా అంశంలో పునరాలోచన చేయండని ఎమ్మెల్సీ కవితకు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. కవిత బదుసలిస్తూ... 'నేను రాజీనామా సమర్పించి ఇప్పటికే నాలుగు నెలలు అయ్యింది. బీఆర్ఎస్ పార్టీతో నాకు ఎలాంటి సంబంధం లేదు. ఆ పార్టీ ఇచ్చిన ఎమ్మెల్సీ నాకు వద్దు. నా రాజీనామా వెంటనే ఆమోదించండి' అని కోరారు.

# నల్లమల సాగర్‌ను అడ్డుకోండి..

## సుప్రీంకోర్టులో టీ సర్కార్ వాదనలు..

**న్యూఢిల్లీ :** నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన రిట్ పిటిషన్ పై విచారణ ప్రారంభమైంది. తెలంగాణ దాఖలు చేసిన ఈ పిటిషన్ పై సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణ జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపిస్తున్నారు. నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేనందున ప్రాజెక్టు పనులు ఆపాలని.. ఆ మేరకు ఆర్డర్స్ ఇవ్వాలని సుప్రీంకోర్టును తెలంగాణ ప్రభుత్వం కోరింది. పోలవరం ప్రాజెక్టు నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ లేదా నల్లమల సాగర్ జలాశయానికి లింక్ చేసేలా గోదావరిపై ఏపీ ప్రాజెక్టు చేపడుతోందని ఆరోపించింది. ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవని, పనులను తక్షణమే నిలిపివేసేలా పోలవరం ప్రాజెక్టు అథారిటీని ఆదేశించాలని సుప్రీం ధర్మాసనాన్ని టి సర్కార్ అభ్యర్థించింది.కేంద్రం అనుమతించిన మేరకే పోలవరం ప్రాజెక్టు స్వరూపం ఉండాలని, విస్తరణ పనులు చేపట్టడం చట్టవిరుద్ధమని పిటీషన్‌లో తెలంగాణ సర్కార్ పేర్కొంది. తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా నల్లమలసాగర్ ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును కేంద్ర ప్రభుత్వం పరిశీలించడం సమంజసం కాదని తెలంగాణ వాదించింది. ఈ ప్రాజెక్టుపై తదుపరి చర్యలు చేపట్టరాదంటూ జలశక్తి మంత్రిత్వ శాఖ, కేంద్ర జల సంఘం, గోదావరి నదీ యాజమాన్య బోర్డులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని రిట్ పిటిషన్‌లో తెలంగాణ ప్రభుత్వం అభ్యర్థించింది.బచావత్ ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా పోలవరం నుంచి గోదావరి జలాలు తరలించేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టును నిలిపివేయాలని పిటిషన్‌లో కోరింది. గోదావరిపై నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీల నీటిని బొల్లాపల్లి రిజర్వాయర్ ద్వారా నల్లమల్ల సాగర్‌కు తరలించేందుకు ఏపీ ప్రభుత్వం ఈ కొత్త ప్రాజెక్టును ప్రతిపాదించిందని తెలంగాణ ప్రభుత్వం వాదిస్తోంది. ఈ ప్రాజెక్టును నిలిపివేయాలని ఇదివరకే కేంద్ర జలశక్తి శాఖకు, జల వనరుల సంఘానికి తెలంగాణ ప్రభుత్వం లేఖ కూడా రాసింది. అయినప్పటికీ పోలవరం- నల్లమలసాగర్ కోసం ఏపీ ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగించే నిబంధనలు, విభజన చట్టానికి వ్యతిరేకంగా బనకచర్ల లింక్ ప్రాజెక్టు చేపట్టకుండా చూడాలని సుప్రీంకోర్టును టీ సర్కార్ కోరింది.

# ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోతే రైతులే మరమ్మత్తులకు తీసుకెళ్తున్నారు




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం శాసనమండలి వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. పొలాల్లో ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోతే ప్రభుత్వమే ఉచితంగా మారుస్తుందన్నది అవాస్తవమని, రైతులే సొంత డబ్బులు వెచ్చించి వాటిని మరమ్మత్తులకు తరలిస్తున్నారని ఆయన మండలిలో ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో మూడు డీడీలు కడితే ఏడు విద్యుత్ స్తంభాలు మంజూరయ్యేవని, కానీ ప్రస్తుత ప్రభుత్వంలో కేవలం ఒకటే ఇస్తున్నారని, మిగిలిన స్తంభాలను రైతులు బయట కొనుక్కోవాల్సి వస్తోందని సభ దృష్టికి తీసుకొచ్చారు.కాగా ఎమ్మెల్సీ సత్యం చేసిన ఈ వ్యాఖ్యలను శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సమర్థించారు. ట్రాన్స్ ఫార్మర్ల మరమ్మత్తులకు రైతులు డబ్బులు ఖర్చు చేస్తున్నారన్నది ముమ్మాటికీ నిజమేనని, దానికి తానే ప్రత్యక్ష సాక్ష్యమని చైర్మన్ ఒప్పుకున్నారు. సభలో విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క అంతా సవ్యంగానే ఉందని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు పూర్తిగా భిన్నంగా ఉందని, బయట పనులు సాఫీగా జరగడం లేదని చైర్మన్ స్వయంగా వ్యాఖ్యానించడం అధికార పక్షాన్ని ఇరకాటంలో పెట్టింది.

# ఫోన్ ట్యాపింగ్ కేసు..

## సుప్రీం కోర్టులో హరీష్ రావుకు ఊరట!

- సుప్రీం కోర్టులో హరీష్ రావుకు ఊరట
- హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేము
- రాధా కిషన్ రావుకు కూడా ఉపశమనం



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. హరీశ్ రావుకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ (SLP) జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం కొట్టేసింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో హరీష్ రావుతో పాటు మాజీ డీసీపీ రాధా కిషన్ రావుకు కూడా ఉపశమనం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూత్ర వాదనలను వినిపించారు.ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో బీఆర్ ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావుపై గతంలో కేసు నమోదయింది. రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును సవాల్ చేస్తూ.. హైకోర్టును ఆశ్రయించారు హరీష్ రావు. విచారణ జరిపిన హైకోర్టు హరీష్ రావుపై నమోదైన ఎఫ్ఐఆర్ను క్వాష్ చేసింది. దాంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ.. సుప్రీం కోర్టును చక్రధర్ గౌడ్ ఆశ్రయించారు. తెలంగాణ ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. చక్రధర్ గౌడ్ పిటిషన్లోనే హరీష్ రావు విచారణకు అనుమతించాలని కోరింది. ఈరోజు (జనవరి 5న ) రెండు పిటిషన్లను ఇవాళ విచారించిన సుప్రీంకోర్టు.. హైకోర్టు ఆదేశాల్లో తాము జోక్యం చేసుకోవాలని స్పష్టం చేసింది.

# తహశీల్దార్ల గుండెల్లో రైళ్లు!

## అదనపు కలెక్టర్ అక్రమాలపై ఏసీబీ పంజా..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** వరంగల్ బ్యూరో: అదనపు కలెక్టర్ కేసులో ఏసీబీ లోతుగా దర్యాప్తు చేపట్టింది. రెవెన్యూకి సంబంధించిన భూ సంబంధిత కేసుల పై దర్యాప్తు చేస్తున్నారు. కొన్ని కీలకమైన దస్త్రాలకు సంబంధించి సహకరించిన తహశీల్దార్ల చిట్టా పై ఆరా తీస్తున్నారు. అదనపు కలెక్టర్ కాలంలో ఏవైనా ప్రభుత్వ భూముల లావాదేవీలు జరిగాయా, అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారా? అనే కోణంలో పరిశీలిస్తూ దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. గతంలో ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో తహశీల్దార్ కు సంబంధించిన వివరాలు తీసిన విధంగానే ఈ కేసులోనూ సేకరిస్తున్నారు.హన్మకొండ అదనపు కలెక్టర్ గా పనిచేసిన వెంకట్ రెడ్డి గత నెలలో ఏసీబీకి పట్టుబడ్డారు. ఈ కేసులో ఆయనతో పాటు విద్యాశాఖకు చెందిన మరో ఇద్దరిని కూడా పట్టుకున్నారు. వారిపై కేసులను నమోదు చేశారు. ఇదే కేసులో ఏసీబీ అధికారులు అదనపు కలెక్టర్ కు సంబంధించి నగదు, విలువైన ఆస్తులకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.గతంలో నమోదైన ఆదాయానికి మించి ఆస్తులున్న కేసుల పై నజర్ సాధించారు. అదనపు కలెక్టర్ గా పనిచేసిన కాలంలో సివిల్ సప్లై భూసేకరణతో పాటు భూములకు సంబంధించిన వ్యవహారం పరిశీలిస్తున్నారు. కొన్ని వివాదాస్పద భూములకు సంబంధించిన ఫైళ్లు, ధాన్యం సేకరణ, రేషన్ పంపిణీ వంటి వ్యవహారాల్లో పలు ఆరోపణలు వెల్లువెత్తాయి.ధాన్యం సేకరణకు సంబంధించిన కొన్ని మిల్లులకు సహక రించడం, ధాన్యం లేకపోయినా కేటాయింపులు చేయడం వంటి అంశాలపై ఆరోపణలు ఎక్కువగా వచ్చాయి. గ్రీన్ ఫీల్డ్ హైవేకు సంబంధించిన భూసేకరణలో ఆరోపణలు పెరిగాయి. నేరుగా రైతులే ఆయన పైన ఆరోపణలు గుప్పించారు. ఆయనను ఏసీబీ పట్టుకోగానే కలెక్టరేట్ కు వచ్చి సంబరాలు చేసుకున్నారు. నాగపూర్ నుంచి మంచిర్యాల, భూపాలపల్లి, హన్మకొండ, వరంగల్ జిల్లాల మీదుగా ఈ గ్రీన్ ఫీల్డ్ హైవే విజయవాడ వరకు నిర్మాణం అవుతుంది. దీని కోసం హన్మకొండ జిల్లా పరిధిలో రైతుల నుంచి భూములను సేకరించారు. ఈ భూములకు సంబంధించిన చెల్లింపుల్లోనూ, సేకరణలోనూ పలు గోల్ మాల్ జరిగినట్లు రైతులు ఆరోపించారు.చాలా వ్యవహారాల్లో నగరానికి సంబంధించి ఒక తహశీల్దార్ బాగా సహక రించినట్లు తెలుస్తుంది. జిల్లా పరిధిలో కొన్ని అంశాలు పరిష్కరించడంలో, బదిలీల వంటి వాటిలో సంధానకర్తగా ఆ తహశీల్దార్ వ్యవహరించి అదనపు కలెక్టర్ ద్వారా పనులు చేయించినట్లు ఏసీబీ అధికారులు పరిశీలి స్తున్నట్లు తెలుస్తుంది. ఆయన తీసుకున్న వివాదా నిర్ణయాలపై కూడా వివరాలు సేకరి స్తున్నట్లు తెలుస్తుంది. ఏసీబీకి పట్టుబడిన తర్వాత కొంత మంది తహశీల్దార్లు ఆయనకు దూరంగా ఉండటంతో పాటు గతంకు సంబంధించిన వివరాలు బయటకు వస్తాయే మోనని ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తుంది. ఏసీబీ లోతుగా దర్యాప్తు చేస్తుండటంతో కొంత మంది తహశీల్దార్లు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తి కావడంతో ఇదే సమయంలో జిల్లా నుంచి వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. ఏసీబీ పేరు ద్వారా అధికారులు బయపడుతుండగా వివరాల ఆధారంగా మరికొంత మందిపై చర్యలు చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## ప్రపంచ పర్యావరణ సంస్థను అభినందించిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్....

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ కార్యదర్శి సిహెచ్ సాగర్ నేత ఆధ్వర్యంలో గత 14 సంవత్స రాలుగా ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో మేడారంలో కాలుష్యరైత మేడారం జాతర జరగాలని నిర్మాణం కోసం ప్రపంచ పర్యావరణ సంస్థ కార్యవర్గము ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించారు ఈనెల 28వ తారీకు నుంచి 31 వ తారీకు వరకు జరిగే ఆసియా ఖండంలోని అతిపెద్ద మేడారం మహా జాతర ఆదివాసి గిరిజన మహా జాతర సందర్భంగా దాదాపుగా రెండు కోట్ల యాభై లక్షల మంది ప్రజలు పాల్గొన్న పోతున్నారు కాబట్టి ఈ సందర్భంగా మేడారం మొత్తం కూడా కాలుష్యం బారిన పడబోతుంది గత 14 సంవ త్సరాలుగా లక్షలాది క్యాట్ బ్యాగులు క్లాత్ బ్యాగులు పంచిపెట్టి ప్లాస్టిక్ రహితంగా కాలుష్య రహితంగా మేడారం నిర్మాణం కోసం ప్రజల్ని చైత న్యవంతులం చేయడం జరిగింది అందులో భాగంగా ఈ సంవత్సరం కూడా తమ సంస్థ ఆధ్వర్యంలో వేలాది మందితో ప్రజా ప్రదర్శనలు ఏర్పాటు చేయబోతుంది ఇప్పటికే వేలాదిమంది విద్యార్థులను ఇప్పటికే ప్రధాన నగరాలు నిర్వహించడం జరిగింది విద్యార్థిని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ శర్మ గారిని కలిసి వారి చేతుల మీదుగా ప్రపంచ పర్యావరణ సంస్థ గోడపత్రికను ఆవిష్కరించడం జరిగింది ఈ సందర్భంగా గవర్నర్ గారు మాట్లాడుతూ ఎవరూ చేయని పనిని ప్రపంచ పర్యావరణ సంస్థ వారు నిర్వహించడం అభినందనీయం ప్రతి ఒక్కరు ఇలాంటి మంచి కార్యక్రమాల్లో భాగస్వామ్యలై ప్రభుత్వం మీడియా ప్రజలందరూ కూడా కాలుష్యత్తు నిర్మాణం కోసం ప్లాస్టిక్ రహిత మేడారం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతమైన పౌరులుగా క్లీన్ మేడారం గ్రీన్ మేడారం సేవ్ మేడారం నినాదాన్ని పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని అందుకు తన వంతు సంపూర్ణ సహకారం ఉంటుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ ప్రతినిధి బృందం ఇవి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

## బీఆర్ఎస్ పార్టీలోకి ధైదసత్యం మాదిగ

### భారీ ర్యాలీతో పార్టీ కార్యాలయంలో చేరికలు





**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మిర్యాలగూడ పట్టణంలో నెలరోజుల ముందుగానే ఎన్నికల వేడి రాజుకుంటుంది.వివిధ వార్డుల నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి చేరికలు ముమ్మరంగా సాగుతున్నాయి.సోమవారం టిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన ఎమ్మార్పీఎస్ పోలిట్ బ్యూరో సభ్యుడు ధైద సత్యం మాదిగ 35 వ వార్డు నుంచి భారీ ఎత్తున కార్యకర్తలతోటి మిర్యాలగూడ పట్టణంలోని టిఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి చేరుకొని టిఆర్ఎస్ యువజన నాయకుడు నల్లమోతు సిద్ధార్థ,మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసిం హారెడ్డి,నాగార్జున చారి రాంబో శీను,మాజీ కౌన్సిలర్ ధైద వెంకటేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది.ఈ సందర్భంగా నల్లమోతు సిద్ధార్థ మాట్లాడుతూ ఉద్యమ ప్రస్థానం ఉన్న నాయకుడిగా ఆయనకు పార్టీలో సముచిత స్థానం లభిస్తుందని తెలిపారు. రాబోయే ఎన్నికలలో టిఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా ధైద సత్యం మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యా యుడిగా ఎంతోమంది విద్యార్థులకు మంచి భవిష్యత్తుని అందించగలి గానని,అలాగే నా వార్డ్ ప్రజలకు సొంత ఊరుకు సేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయలోకి వచ్చానని అందుకే ఉద్యమ స్ఫూర్తి కలిగిన పార్టీలో చేరడం జరిగిందని అన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ఉన్నప్పుడు ప్రతి ఒక్కరు నాకు ఏ విధంగా సహకరించారో అదేవిధంగా నాకు ఈ పార్టీలో, రాబోయే ఎలక్షన్ లో సహకరిం చాలని వార్డు ప్రజలను పేరుపేరునా కోరారు.ఈ సందర్భంగా పెద్ద ఎత్తున యువత మరియు మహిళలు బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకున్నారు.

# బక్క జడ్సన్ అరెస్ట్

## అసెంబ్లీ ముట్టడికి రిటైర్డ్ ఉద్యోగుల యత్నం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల వేళ వివిధ సంఘాలు తమ సమస్యలను ఎత్తి చూపేందుకు అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా.. తమకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రిటైర్డ్ ఉద్యోగులు సోమవారం తెలంగాణ అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించారు. దీంతో అసెంబ్లీ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రధానంగా 2024 నుండి ప్రభుత్వం పెన్షన్ దారులకు చెల్లించాల్సిన కరువు భత్యం , ఇతర పాత బకాయిలను విడుదల చేయడం లేదని వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి తమ పెండింగ్ డీఏలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో బక్క జడ్సన్ సహా పలువురు రిటైర్డ్ ఉద్యోగులను పోలీసులు అరెస్ట్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించారు. పెన్షన్ దారుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరి స్తోందని, తక్షణమే తమకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా ఆందోళన కారులు నినాదాలు చేశారు. దీంతో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# త్వరలో 850 పోస్టుల భర్తీ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో అదనంగా 490 వెంటిలేటర్లు, 9 ఎంఆర్ ఐ యంత్రాలు అందుబాటులోకి తీసుకొస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. ఈ మేరకు శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వ దవాఖానాల్లో వెంటిలేటర్ల విషయంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో సుమారు 1790 వెంటిలేటర్ బెడ్లు ఉన్నాయన్నారు. ప్రభుత్వ వైద్య సేవలు మెరుగుపడటంతో చికిత్స కోసం వచ్చే పేషెంట్ల సంఖ్య పెరిగిందని చెప్పారు. ఐసీయూ బెడ్లు, వెంటిలేటర్ బెడ్ల విషయంలో పెరిగిన అవస రాలకు అనుగుణంగా మరో 490 వెంటిలే టర్లను కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. గాంధీ, ఉస్మానియా, ఎంజీఎం వంటి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల్లో వీటిని ప్రజలకు అందుబా టులోకి తీసుకొస్తామన్నారు.

**త్వరలో 850 పోస్టుల భర్తీ:**

నిమ్స్ కు కెపాసిటీకి మించి పేషెంట్లు వస్తున్నారని మంత్రి చెప్పారు. చివరి నిమిషంలో ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటళ్ల నుంచి వెంటిలేటర్ మీద నిమ్స్ కు వచ్చే పేషెంట్ల సంఖ్య ఎక్కువైందన్నారు. పెరిగిన అవసరాలకు అనుగుణంగా నిమ్స్ లో అదనంగా మరో 125 వెంటిలెటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నిమ్స్ లో కొత్తగా సుమారు 850 పోస్టులను భర్తీ చేయబోతున్నామని గాంధీ, ఉస్మానియా, ఆదిలాబాద్ రిమ్స్ , ఎంజీఎంలో మాత్రమే ఎంఆర్ ఐ యంత్రాలు ఉన్నాయి. మరో 9 ప్రభుత్వ హాస్పిటల్స్ లో ఎంఆర్ ఐ యంత్రాలు అందుబాటులోకి తీసుకొ స్తున్నట్టు చెప్పారు. గతేడాది కొత్తగా 213 అంబులెన్స్ లను అందుబాటులోకి తీసుకొచ్చాం. దీంతో ఎమర్జన్సీ రెస్పాన్స్ 18 నిమిషాల నుంచి 13 నిమిషాలకు తగ్గిందన్నారు. ఈ ఏడాది మరో 79 కొత్త అంబులెన్స్ లను ఏర్పాటు చేస్తున్నాం. ఇవి అందుబాటులోకి వచ్చాక ఎమర్జెన్సీ రెస్పాన్స్ టైమ్ 10 నిమిషాలకు తగ్గుతుం దన్నారు. ఈ రెండేండ్లలో కొత్తగా 16 డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేశాం. ఎగ్జిస్టింగ్ డయాలసిస్ సెంటర్లలో వందకుపైగా డయాలసిస్ మిషన్లను అదనంగా అందుబాటులోకి తీసుకొచ్చినట్టు మంత్రి తెలిపారు.

**ప్రతి 25 కిలోమీటర్లకు ఒక డయాలసిస్ సెంటర్:**

రాష్ట్రంలోని ఏ పాయింట్ నుంచైనా 20 నిమిషాల ప్రయాణంలోనే డయాలసిస్ సెంటర్ ఉండేలా, ప్రతి 25 కిలోమీటర్లకు ఒక డయాలసిస్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించామని డయాలసిస్ పేషెంట్లకు ఇబ్బంది కలగకుండా చూసుకునే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. క్యూర్ ఏరియాలో బస్తీ దవాఖాన్లను బలోపేతం చేస్తున్నామని బస్తీ దవాఖాన్లకు ఇంతకుముందు పీహెచ్ సీల నుంచి మందులు సరఫరా చేసేది. ఇకపై సెంట్రల్ మెడిసినల్ స్టోర్స్ నుంచి నేరుగా బస్తీ దవాఖాన్లకు పంపిణీ చేయబోతున్నా మన్నారు. ఈ నిర్ణయంతో బస్తీ దవాఖాన్లలో మెడిసిన్ ఆర్టిఫిషియల్ కొరతకు చెక్ పెట్టబో తున్నామని వెల్లడించారు.


## న్యాయవాదుల ప్రశ్నించే గొంతుకనవుతా



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** తెలంగాణ బార్ కౌన్సిల్ ఎలక్షన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాఘవులు దేవల్ల ఎలక్షన్ ప్రచారం లో భాగంగా మిర్యాలగూడ బార్ అసోసియేషన్ లో అధ్యక్షుడు నేతి సత్యనా రాయణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కౌన్సిల్ అభ్యర్థి హైకోర్టు అడ్వకేట్ రాఘవులు దేవల్ల మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన వాడను నేను అందరి సమస్యల పట్ల అవగాహన ఉంది న్యాయవాదుల ప్రతి సమస్యపై ప్రశ్నించే గొంతుకునవుతా అని అన్నారు. న్యాయవాదుల ముఖ్యమైన ఐదు సమస్యలపై స్పష్టమైన హామీ ఇవ్వడం జరిగింది. న్యాయ వాదులకు డెత్ బెనిఫిట్స్ ను అందజేసేట్లు చూస్తానన్నారు ప్రతి సంవత్సరం ఆడిట్ చేయించి ఆడిట్ రిపోర్ట్ ప్రతి బార్ అసోసి యేషన్కు పంపిస్తానన్నారు.ప్రతి న్యాయవాదికి ఆరోగ్య భీమా అందేటట్టుగా చూసి వారి సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. మీరంతా మొదటి ప్రాధాన్యత ఓటుగా నాకు వేసి గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసి యేషన్ జనరల్ సెక్రెటరీ అలుగుబెల్లి భూపతి రెడ్డి,గొడ్డటి సాయికుమార్ యాదవ్,పల్ రెడ్డి రమణారెడ్డి,డి శ్రీనివాసచారి, మట్టయ్య ధూపాటి,బంటు మోహన్,రాయారపు భాస్కర్, పెంటారెడ్డి,కొంక వెంకన్న,ప్రసాద్, కార్తీక్, స్వరాజ్యం,కొంక నిర్మల, వినోద్,మాతంగి సైదులు,ఏ. వెంకట్ రెడ్డి, పెద్దమా కిరణ్,పాతూరి శ్రీనివాస్ రెడ్డి,ని రంజన్ రెడ్డి,మోహన్,ఉమేష్ చారీ, విజయ్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## మేడారం మహా జాతరకు ముహూర్తం ఫిక్స్..

### 19న గద్దెలు, ప్రాంగణ పునరు ద్ధరణ ప్రారంభోత్సవం




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ప్రజల కొంగుబంగారం మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర-2026 కు ముహూర్తం ఖరారైంది. ఇందులో భాగంగా జనవరి 19న అమ్మవారి గద్దెలు, ప్రాంగణ పునరుద్ధరణ ప్రారంభోత్సవం అట్టహాసంగా జరగనుంది. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా సీఎం రేవంత్ రెడ్డి , డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొననున్నారు. జనవరి 28న మహా జాతర ప్రారంభమై జనవరి 31న అంటే నాలుగు రోజుల పాటు కొనసాగనుంది. 28న సారలమ్మ దేవత గద్దెకు ఆగమనం, 29న సమ్మక్క దేవత గద్దెకు ఆగమన కార్యక్రమాలు జరగ నున్నాయి. ఇక 30న భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకోనున్నారు. 31న సాయంత్రం 4 గంటల సమయంలో తిరిగి అమ్మవార్లు వనప్రవేశం చేయనున్నారు. ఇప్పటికే ములుగు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మహా జాతరకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## న్యాయమూర్తులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మిర్యాలగూడ పట్టణ కోర్టు సముదాయంలోని జిల్లా ఐదవ అదనపు జడ్జి శ్రీ కె.వి చంద్రశేఖర రావు,సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీమతి ప్రమీల జైన్ లకు నూతన




సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మిర్యాలగూడ బార్ అసోసియేషన్ సభ్యులు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నేతి సత్య నారాయణ,జనరల్ సెక్రెటరీ అలుగుబెల్లి భూపతిరెడ్డి, కోశాధికారి గొడ్డటి సాయికుమార్ యాదవ్,కొంక వెంకన్న, స్వరాజ్యం,ధూపాటి మట్టయ్య, రాయారపు భాస్కర్, ఉమాశంకర్,బాలు నాయక్ తదితర న్యాయవాదులు ఉన్నారు.

## ఆర్టీసీ బస్సెక్కిన సీఎం రేవంత్, మంత్రులు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** పూలే సినిమా చూసేందుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు మరియు ఎమ్మెల్సీలు ఆర్టీసీ బస్సులో బయలు దేరారు. ప్రసాద్ ల్యాబ్ లో సినిమాను ప్రదర్శించగా అసెంబ్లీ సమావేశం అనంతరం అందరూ కలిసి బస్సులో వెళ్లారు. దీంతో సీఎం ప్రయాణిస్తున్న బస్సులు పోలీసులు భారీ సెక్యురిటీ కల్పించారు. ఇదిలా ఉంటే పూలే సినిమాను సావిత్రీబాయి పూలే జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కించారు. హిందీలో సినిమాను తెరకెక్కించగా 2025 ఏప్రిల్ 25న విడుదలైంది. ఈ చిత్రానికి అనంత్ మహదేవన్ దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్, డ్యాన్సింగ్ శివ ఫిల్మ్స్ కింగ్స్ మెన్ ప్రొడక్షన్స్ ఫిల్మ్స్ బ్యానర్లపై సినిమాను నిర్మించారు. చిత్రంలో ప్రతీక్ గాంధీ, పత్రలేఖ పాల్ ప్రధాన పాత్రల్లో నటించారు. కుల నిర్మూలనకు పూలే చేసిన కృషి, మహిళల కోసం చేసిన పోరాటాలను సినిమాలో కళ్లకు కట్టినట్టు చూపించారు.

# టీ20 వరల్డ్ కప్ ఎఫెక్ట్..



ఆస్ట్రేలియా డేంజర్ ఆటగాడు మ్యాక్సీ మామ సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. జట్టు కోసం వికెట్ కీపింగ్ చేసేందుకు కూడా ముందుకు వచ్చాడట. మ్యాక్సీ మామ అంటే అందరికీ గుర్తుకు వచ్చేది అతని సిక్సర్లు, బౌండరీలే. కొన్నిసార్లు స్పిన్ బౌలింగ్ వేసి, ప్రత్యర్థిని కట్టడి చేస్తూ ఉంటారు. ఇలా ఆస్ట్రేలియా జట్టులో ఆల్ రౌండర్ గా కొనసాగుతున్నాడు మ్యాక్సీ మామ. అయితే ఇప్పుడు ఆస్ట్రేలియా కోసం మరో కొత్త అవతారంలో కనిపించనున్నాడు మ్యాక్సీ మామ.టీ20 ప్రపంచ కప్ 2026 టోర్నమెంట్ నేపథ్యంలో ఆస్ట్రేలియా జట్టు బ్యాకప్ వికెట్ కీపర్ గా మ్యాక్సీ మామను వినియోగించుకోనున్నారట. జోస్ ఇంగ్లీస్ ఈ టోర్నమెంట్ లో గాయపడితే, మ్యాక్స్ వెల్ కు కీపింగ్ బాధ్యతలు ఇచ్చేందుకు ఆస్ట్రేలియా నిర్ణయం తీసుకుందట. ఇందులో భాగంగానే ఇప్పటి నుంచే వికెట్ కీపింగ్ ప్రాక్టీస్ మొదలు పెట్టాడట ఆస్ట్రేలియా ఆటగాడు మాక్సీ మామ. ఈ నేపథ్యంలోనే అతడు వికెట్ కీపింగ్ చేస్తున్న ఫోటోలు కూడా మారాయి.

# రికీ పాంటింగ్ రికార్డు సమం..

## క్రికెట్ దిగ్గజం సచిన్ కు చేరువగా జో రూట్!



2025-26 యాషెస్ సిరీస్ లో ఇంగ్లండ్ మాస్టర్ బ్యాట్స్ మన్ జో రూట్ మరోసారి సత్తాచాటాడు. సిడ్నీలో జరుగుతున్న ఐదో టెస్టులో రూట్ అద్భుత శతకం బాదాడు. మైకేల్ నెసర్ వేసిన బంతికి రెండు పరుగులు తీసి.. సెంచరీ పూర్తి చేశాడు. ఈ సిరీస్ లో ఇది అతడికి రెండో సెంచరీ కాగా.. టెస్టు క్రికెట్ లో మొత్తం 41వ సెంచరీ. ఈ క్రమంలో ఆస్ట్రేలియా లెజెండ్ రికీ పాంటింగ్ సరసన నిలిచి.. ఆల్ టైమ్ టెస్టు సెంచరీల జాబితాలో మూడో స్థానాన్ని పంచుకున్నాడు.ఈ యాషెస్ సిరీస్ లో జో రూట్ కు ఇది రెండో సెంచరీ. అంతకుముందు బ్రిస్బేన్ లో జరిగిన డే-నైట్ టెస్టులో అజేయంగా 138 పరుగులు చేశాడు. ఆస్ట్రేలియా గడ్డపై గత మూడు యాషెస్ పర్యటనల్లో రూట్ సెంచరీ చేయని విషయం తెలిసిందే. చివరకు ఆసీస్ గడ్డపై సెంచరీ కరువు తీర్చుకున్నాడు. టెస్టుల్లో అత్యధిక సెంచరీలు చేసిన బ్యాటర్ల జాబితాలో రూట్ మూడో స్థానంలో ఉన్నాడు. ఈ జాబితాలో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ మొదటి స్థానంలో ఉన్నాడు. 200 మ్యాచుల్లో 51 సెంచరీలు బాదాడు. దక్షిణాఫ్రికా మాజీ ఆల్ రౌండర్ జాక్వస్ కలీస్ 166 మ్యాచుల్లో 45 సెంచరీలతో రెండో స్థానంలో ఉన్నాడు. 35 ఏళ్ల రూట్ త్వరలోనే కలీస్ రికార్డును బద్దలు కొట్టనున్నాడు. రూట్ ఇంకా 3-4 ఏళ్లు ఆడే అవకాశాలు ఉన్నాయి. క్రికెట్ దిగ్గజం సచిన్ కు చేరువగా లేదా బద్దలు కొట్టే అవకాశాలు లేకపోలేదు.



# హాకీ ఇండియా లీగ్ బెంగాల్ టైగర్స్ శుభారంభం

హాకీ ఇండియా లీగ్ (హెచ్ ఐఎల్ ) మెన్స్ ఈవెంట్ లో డిఫెండింగ్ చాంపియన్ శ్రాచి బెంగాల్ టైగర్స్ శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన తమ తొలి మ్యాచ్ లో 3–-1 తేడాతో జేఎస్ డబ్ల్యూ సూర్మా క్లబ్ పై ఘన విజయం సాధించింది. తొలి రెండు క్వార్టర్స్ లో ఇరు జట్లూ హోరాహోరీగా తలపడటంతో ఒక్క గోల్ కూడా రాలేదు. కానీ బ్రేక్ తర్వాత బెంగాల్ టైగర్స్ జోరు పెంచింది.సుఖ్ జీత్ సింగ్ (33వ నిమిషం), అభిషేక్ (45వ ని), గుర్ సేవక్ సింగ్ (60వ ని) తలో గోల్ చేసి తమ జట్టును గెలిపించారు. సూర్మా తరఫున ప్రభ్ జోత్ సింగ్ (54వ ని) ఏకైక గోల్ చేశాడు. మరోవైపు రాంచీ వేదికగా జరుగుతున్న విమెన్స్ హెచ్ఐఎల్ మ్యాచ్ లో శ్రాచి బెంగాల్ టైగర్స్ మరో విజయం అందుకుంది. ఆదివారం జరిగిన పోరులో 1–-0 తేడాతో రాంచీ రాయల్స్ ను ఓడించి పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి చేరుకుంది. ఆట 37వ నిమిషంలో అగస్టినా గోర్జెలానీ పెనాల్టీ కార్నర్ ను గోల్ గా మలిచి బెంగాల్ కు విజయాన్ని అందించింది.

# టెస్టుల్లో మార్పు కోరుతున్న గిల్!



2025లో భారత టెస్టు జట్టు తీవ్ర నిరాశను ఎదుర్కొంది. దక్షిణాఫ్రికాతో స్వదేశంలో 0-2తో వైట్ వాష్ కు గురైంది. అంతకుముందు నవంబర్ 2024లో న్యూజిలాండ్ చేతిలో 0-3తో క్లీన్ స్వీప్ అయింది. వరుస పరాజయాలతో తీవ్ర ఒత్తిడిలోకి వెళ్లిన టీమిండియా.. ఇప్పుడు 2026లో పుంజుకుని 2027 వరల్డ్ టెస్టు చాంపియన్ షిప్ ఫైనల్ చేరడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో టెస్టు జట్టులో పలు మార్పులు చోటు చేసుకోనున్నట్లు తెలుస్తోంది. టెస్టు కెప్టెన్ శుభ్ మన్ గిల్ కీలక సూచనతో ముందుకు వచ్చాడు. ప్రతి టెస్టు సిరీస్ కు ముందు తప్పనిసరిగా 15 రోజుల రెడ్ బాల్ క్యాంప్ నిర్వహించాలని బీసీసీఐ ని కోరినట్లు సమాచారం.

**ప్రాక్టీస్ లేమి వల్లే..**

'టెస్టు సిరీస్‌కు ముందు సరైన సన్నాహాలు జరగడం లేదు. ఈ విషయంలో గిల్ స్పష్టంగా ఉన్నాడు. ఈ సీజన్‌లో షెడ్యూల్ చాలా గందరగోళంగా ఉండటంతో ఆటగాళ్లకు ప్రాక్టీస్ చేయడానికి సరైన సమయం దొరకలేదు. కనీసం 15 రోజుల రెడ్ బాల్ క్యాంప్ ఉంటేనే ఫలితాలు వస్తాయని గిల్ బోర్డుకు సూచించాడు' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

**షెడ్యూల్ వల్లే..**

2025లో భారత జట్టు చాలా బిజీ అయింది. ఆసియా కప్ గెలిచిన నాలుగు రోజుల్లోనే వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ ఆడింది. అలాగే ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్ ముగిసిన ఆరు రోజుల్లోనే దక్షిణాఫ్రికాతో టెస్టులు ప్రారంభమయ్యాయి. 2026లోనూ భారత్‌కు వరుసగా వైట్ బాల్ సిరీస్‌లు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రతి టెస్టు సిరీస్‌కు 15 రోజుల క్యాంప్ నిర్వహించడం పెద్ద సవాలేనని బీసీసీఐ వర్గాలు భావిస్తున్నాయి.

**లక్ష్మణ్‌కు బాధ్యతలు అప్పగించనున్నారా?**

ఈ క్యాంపుల నిర్వహణ కోసం బీసీసీఐ కొత్త మార్గం ఆలోచిస్తోంది. టీమిండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఎక్కువగా వైట్‌బాల్ జట్లతో బిజీగా ఉండే అవకాశం ఉండటంతో.. నేషనల్ క్రికెట్ అకాడమీ చీఫ్ వీవీఎస్ లక్ష్మణ్ సేవలను వినియోగించాలనే ఆలోచనలో బోర్డు ఉందని సమాచారం. 'కొన్ని సందర్భాల్లో గంభీర్ వైట్‌బాల్ టీమ్‌తో ఉంటారు. అదే సమయంలో టెస్టు సిరీస్ దగ్గరపడితే.. రెడ్ బాల్ క్యాంప్ నిర్వహణ బాధ్యతలను వీవీఎస్ లక్ష్మణ్‌కు అప్పగించే అవకాశం ఉంది' అని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి.

# ముగిసిన రెండో రోజు ఆట..

## 218 పరుగుల ఆధిక్యంలో ఇంగ్లండ్



యాషెస్ సిరీస్ లో భాగంగా ఆస్ట్రేలియా-ఇంగ్లండ్ సిడ్నీ వేదికగా ఐదో టెస్టులో తలపడుతున్నాయి. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 34.1 ఓవర్లు ఆడిన ఆస్ట్రేలియా.. 2 వికెట్లు కోల్పోయి 166 పరుగులు చేసింది. ఇంగ్లండ్ పై ఇంకా 218 పరుగులు వెనుకంజలో ఉంది. రెండో రోజు ఆట ముగిసేటప్పటికీ క్రీజులో మిచెల్ నెసర్(1), ట్రావిస్ హెడ్(91) క్రీజులో ఉన్నారు. ఇంగ్లండ్ బౌలర్లలో కెప్టెన్ బెన్ స్టోక్స్ కే రెండు వికెట్లు దక్కాయి.అంతకు ముందు 211/3 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్ బ్యాటర్లు.. 384 పరుగులకు ఆలౌటయ్యారు. జో రూట్(160) అద్భుత శతకంతో రాణించాడు. హ్యారీ బ్రూక్(84) ఆకట్టుకున్నాడు. జెమీ స్మిత్(46) పర్వాలేదనిపించాడు. మిగతా బ్యాటర్లంతా స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేరారు. ఆసీస్ బౌలర్లలో నెసర్‌కు 4, స్టార్క్, బోలాండ్ తలో రెండు, గ్రీన్, లబుషేన్ చెరొక వికెట్ పడగొట్టారు.అనంతరం బ్యాటింగ్‌కి దిగిన ఆసీస్ ఆదిలో కాస్త తడబడింది. చకచకా స్కోరు చేయలేకపోయింది. జాక్ వెదర్లాండ్(21), లబుషేన్(48)ను స్టోక్స్ స్వల్ప స్కోరుకే వెనక్కి పంపాడు. ట్రావిస్ హెడ్(91*) శతకానికి చేరువలో ఉన్నాడు.

# బిజినెస్

## మరోసారి భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు

గతేడాది మెరుపులు, వెలుగులు సృష్టించిన బంగారం, వెండి ధరలు.. ఈ ఏడాది కూడా విశ్వరూపం సృష్టించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. గత సంవత్సరం అంతర్జాతీయంగా పలు దేశాల్లో యుద్ధాలు కారణంగా తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. దీంతో ధరలు ఆకాశన్నంటాయి. ప్రస్తుతం కొన్ని దేశాలు శాంతించాయి. కానీ ఈ ఏడాది ప్రారంభం నుంచే మరికొన్ని దేశాల్లో ఉద్రిక్తలు చోటుచేసుకున్నాయి. రెండు శక్తివంతమైన గల్ఫ్ దేశాలైన సౌదీ-యూఏఈ మధ్య టెన్షన్ వాతావరణం నెలకొంది. ఇంకోవైపు అమెరికా-వెనిజులా, రష్యా-ఉక్రెయిన్, ఇరాన్ లో పరిస్థితులు ఏ మాత్రం బాగోలేదు. దీంతో ఈ ఏడాది కూడా ధరలు సునామీ సృష్టించే సూచనలు కనిపిస్తున్నాయి.ఈరోజు సిల్వర్ ధర మెరుపులు సృష్టించింది. ఏకంగా రూ.6,000 పెరిగింది. దీంతో ఈరోజు బులియన్ మార్కెట్ లో కిలో వెండి ధర రూ.2,47, 000 దగ్గర అమ్ముడవుతోంది. హైదరాబాద్ , చెన్నైలో మాత్రం కిలో వెండి ధర రూ.2,65,000 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక ఢిల్లీ, ముంబై, కోల్ కతాలో మాత్రం కిలో వెండి ధర రూ.2,47, 000 దగ్గర అమ్ముడవుతోంది.ఇక ఈరోజు తులం గోల్డ్ పై రూ.1,580 పెరిగింది. దీంతో బులియన్ మార్కెట్ లో ఈరోజు 24 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.1,580 పెరగగా.. రూ.1,37,400 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.1,450 పెరగగా రూ.1,25,950 దగ్గర అమ్ముడవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.1,180 పెరగగా రూ.1,03,050 దగ్గర ట్రేడ్ అవుతోంది.





# ఐ ఫోన్ లవర్స్‌కు షాక్..!

ఒక్కసారి ఐఫోన్ కు మారితే చాలు.. మార్కెట్ లోకి వచ్చే కొత్త మోడల్ ను కొనుగోలు చేస్తుంటారట ఐఫోన్ లవర్స్ .. కొత్త మోడల్ ఎప్పుడు వస్తుందా? అని వేచి చూస్తుంటారు.. లాంచ్ కి అనుగుణంగా దానిని కొనుగోలు చేసేందుకు ప్లాన్ కూడా చేసుకుంటారు.. అయితే, ఈ సంవత్సరం యాపిల్ తన దీర్ఘకాల సంప్రదాయాన్ని బ్రేక్ చేసే అవకాశం ఉంది.. ఈ సంవత్సరం కంపెనీ ఐఫోన్ 18 ను లాంచ్ చేయదని నివేదికలు సూచిస్తున్నాయి. బదులుగా, ఇది తన వార్షిక ఐఫోన్ లాంచ్ ఈవెంట్ ను పూర్తిగా మార్చవచ్చు. గత కొన్ని సంవత్సరాలుగా, కంపెనీ తన ప్రో మరియు స్టాండర్డ్ మోడళ్లను ఒకేసారి విడుదల చేస్తూ వచ్చింది..అయితే, యాపిల్ కంపెనీ ఇప్పుడు ఈ నమూనాను బ్రేక్ చేయవచ్చు.. ఐఫోన్ 17 లైనప్ కు అద్భుతమైన స్పందన ఉన్నప్పటికీ, కంపెనీ ఐఫోన్ 18 లాంచ్ ను ఆలస్యం చేస్తుందని నివేదికలు చెబుతున్నాయి.. ఆ నివేదికల ప్రకారం.. కంపెనీ 2026లో ఐఫోన్ 18ని లాంచ్ చేయడం లేదు..

**మరి ఐఫోన్ 18 లాంచ్ ఎప్పుడు..?**

ఐఫోన్ 18 లాంచ్ ఆలస్యం అవుతుందని గతంలో నివేదికలు వచ్చాయి. మాక్ రూమర్స్ తన తాజా నివేదికలో కంపెనీ ఐఫోన్ 18ను 2027 నాటికి లాంచ్ చేయవచ్చని సూచించింది. అప్పటి వరకు, ఐఫోన్ 17 కంపెనీ పోర్ట్ ఫోలియోలో తాజా నాన్-ప్రో స్మార్ట్ ఫోన్ గా ఉంటుంది. యాపిల్ తన స్టాండర్డ్ లైనప్ ను ఒక సంవత్సరం కంటే ఎక్కువ కాలంగా రిఫ్రెష్ చేయకపోవడం ఇదే మొదటిసారి అవుతుంది. గత దశాబ్ద కాలంగా, కంపెనీ ప్రతి సెప్టెంబర్ లో తన లైనప్ ను ప్రారంభించింది. ఇది కొన్ని మోడళ్లను భర్తీ చేసినప్పటికీ, దాని స్టాండర్డ్ మోడల్ ను ఎప్పుడూ దాటవేయలేదు.

**ప్రో మోడల్ మాత్రమే ప్రారంభించబడుతుంది..!**

మీరు ఐఫోన్ 18 కొనాలని ప్లాన్ చేస్తుంటే, మీరు చాలా కాలం వేచి ఉండాల్సి ఉంటుంది. కంపెనీ 2026 లో ఐఫోన్ 18 ప్రో మరియు ఐఫోన్ 18 ప్రో మాక్స్ లను లాంచ్ చేస్తుంది. కంపెనీ తన మొదటి ఫోల్డ్ ఫోన్ ను కూడా 2026 లో లాంచ్ చేయవచ్చు. ఇక, కంపెనీ 2027 లో ఐఫోన్ 18e మరియు ఐఫోన్ ఎయిర్ 2 లతో పాటు ఐఫోన్ 18 ను కూడా లాంచ్ చేయవచ్చు. అంటే కంపెనీ సంవత్సరానికి రెండు ప్రధాన ఈవెంట్ లను నిర్వహిస్తుంది. ఒక ఈవెంట్ లో ఐఫోన్ 18 ప్రో మరియు ఐఫోన్ 18 ప్రో మాక్స్ లను లాంచ్ చేస్తారు. ఈ ఫోన్ లు సెప్టెంబర్ 2026 లో లాంచ్ కావచ్చు. ఐఫోన్ 18, ఐఫోన్ 18e మరియు ఐఫోన్ ఎయిర్ 2 2027 ప్రారంభంలో లాంచ్ కావచ్చు అని అంచనా వేస్తున్నారు..

# ప్రారంభ ట్రేడింగ్‌లో రూపాయి డీలా..



గత వారం రోజులుగా స్థిరంగా ఉన్న రూపాయి విలువ సోమవారం ఉదయం ప్రారంభ ట్రేడింగ్ లో డీలా పడింది. దీంతో ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్లో భారత రూపాయి విలువ అమెరికన్ డాలర్ తో పోలిస్తే స్వల్పంగా క్షీణించింది. ప్రారంభ ట్రేడింగ్ లో 4 పైసలు నష్టపోయిన రూపాయి, ప్రస్తుతం రూ. 90.24 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ బలపడటం , పెట్టుబడిదారుల సెంటిమెంట్ కారణంగా రూపాయి పై ఒత్తిడి పెరిగిందని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. గత సెషన్ లో ముగింపు స్థాయితో పోలిస్తే ఈ పతనం నమోదైంది.అయితే, భవిష్యత్తులో రూపాయి తిరిగి పుంజుకోవడానికి కొన్ని కీలక అంశాలు దోహద పడే అవకాశముంది. సాధారణంగా దేశంలోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహం పెరగడం, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గడం, భారత ఎగుమతులు పెరగడం వంటివి రూపాయి విలువను బలపరుస్తాయి. అలాగే, కరెన్సీ మరీ బలహీనపడిన సందర్భాల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డాలర్లను విక్రయించి జోక్యం చేసుకోవడం ద్వారా రూపాయి స్థిరత్వానికి చర్యలు తీసుకుంటుందని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.

# ఒత్తిడిలో ఐటీ రంగం..




అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు, ఐటీ రంగం అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటుండడంతో దేశీయ సూచీలు ఒడిదుడుకుల్లో కొనసాగుతున్నాయి. అయితే ఆటో, మెటల్, రియాల్టీ రంగాలు రాణిస్తుండడం కొద్దిగా కలిసివస్తోంది. మరో వైపు బ్యాంకింగ్ రంగం కూడా లాభాలతో రాణిస్తోంది. డాలర్ తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ పడిపోవడం కలవరపెడుతోంది. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప నష్టాల్లో కదలాడుతున్నాయి. గత సెషన్ ముగింపు (85, 762)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం వంద పాయింట్లకు పైగా నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత కాసేపు లాభాల్లోకి వచ్చింది. అయితే ఆ వెంటనే నష్టాల్లోకి దిగజారింది. ప్రస్తుతం ఉదయం 10:10 గంటల సమయంలో సెన్సెక్స్ 30 పాయింట్ల స్వల్ప నష్టాలతో 85, 731 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడుతోంది. ప్రస్తుతం 6 పాయింట్ల స్వల్ప నష్టంతో 26, 358 వద్ద కదలాడుతోంది.సెన్సెక్స్‌లో బంధన్ బ్యాంక్, లోధా డెవలపర్స్, అంబర్ ఎంటర్‌ప్రైజెస్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్, డాబర్ ఇండియా మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఆయిల్ ఇండియా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఆర్బీఎల్ బ్యాంక్, ఇన్ఫో ఎడ్జ్, ఓఎన్‌జీసీ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 106 పాయింట్ల నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 166 పాయింట్లు ఎగబాకింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 90.23గా ఉంది.



## మలయాళ బ్యూటీకి హిందీ ఛాన్స్..

సౌత్ సినిమాల్లో తనదైన నటనతో మెప్పిస్తున్న మలయాళ భామ కల్యాణి ప్రియదర్శన్ ఇప్పుడు బాలీవుడ్ బాట పట్టింది. గతేడాది విడుదలైన 'కొత్త లోక: చాప్టర్ 1' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించిన ఈమె, ఇప్పుడు ఏకంగా బాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రణవీర్ సింగ్ సరసన నటించే అవకాశం దక్కించుకుంది. జై మెహతా దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ భారీ బడ్జెట్ చిత్రానికి 'ప్రలే' అనే ఆసక్తికరమైన టైటిల్ ను ఖరారు చేశారు. ఇది ఒక వినూత్నమైన 'జాంబీ యాక్షన్ థ్రిల్లర్' కావడం విశేషం. ఈ సినిమాతో కల్యాణి హిందీ చిత్రసీమలోకి గ్రాండ్ గా అడుగుపెట్టబోతుండటంతో ఆమె అభిమానులు ఫుల్ ఖుషీలో ఉన్నారు.ప్రస్తుతం రణవీర్ సింగ్ నటించిన 'ధురంధర్' సినిమా బాక్సాఫీస్ వద్ద వసూళ్ల ప్రభంజనం సృష్టిస్తోంది. ఈ ఏడాది మార్చి 19న దీని సీక్వెల్ 'ధురంధర్ 2' విడుదల కానుంది. ఆ తర్వాతే 'ప్రలే' సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని సమాచారం. ఈ చిత్రాన్ని రణవీర్ సింగ్ స్వయంగా తన 'మా కసమ్ ఫిలిమ్స్' బ్యానర్ పై నిర్మిస్తుండటం మరో విశేషం. హాలీవుడ్ స్థాయి వాల్యూస్ తో, ఒక సరికొత్త ప్రపంచాన్ని కళ్లకు కట్టేలా ఈ జాంబీ థ్రిల్లర్ ను రూపొందిస్తున్నారు. త్వరలోనే దీనిపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వెలువడనుంది. మొత్తానికి బాలీవుడ్ ఎంట్రీ తో కల్యాణి ప్రియదర్శన్ కెరీర్ ఎలాంటి మలుపు తిరుగుతుందో చూడాలి.

## తెలుగులో నా క్రష్ అతనే..

తెలుగులో తన క్రష్ ప్రభాస్ అంటూ సంచలన వ్యాఖ్యలు చేసింది హీరోయిన్ మాళవిక మోహన న్. అతడు అంటే తనకు చాలా ఇష్టమని పేర్కొంది. హీరో ప్రభాస్ లేటెస్ట్ గా నటించిన సినిమా ది రాజా సాబ్. మారుతి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా రిలీజ్ కానుంది. జనవరి 9వ తేదీన రిలీజ్ కాబోతున్న ది రాజా సాబ్ సినిమాలో ముగ్గురు హీరోయిన్లు నటిస్తున్నారు. ఇందులో మాళవిక మోహనన్ కూడా ఉన్నారు. హారర్ కామెడీ నేపథ్యంలో వస్తున్న ఈ సినిమా ప్రమోషన్స్ లో హీరోయిన్ మాళవిక బిజీగా ఉన్నారు.ఇందులో భాగంగానే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న హీరోయిన్ మాళవిక, ప్రభాస్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలుగు చిత్ర పరిశ్రమలో తన క్రష్ ప్రభాస్ అంటూ వ్యాఖ్యానించారు. బాహుబలి సినిమా చూసిన తర్వాత ప్రభాస్ కు ఫ్యాన్ అయిపోయానని వెల్లడించారు. ది రాజా సాబ్ సినిమా షూటింగ్ సమయంలో అతని బిహేవియర్ చాలా బాగా నచ్చినట్లు తెలిపారు. హైదరాబాద్ బిర్యానీ కూడా తనకు తినిపించాడని మాళవిక వివరించారు. దీంతో హీరోయిన్ మాళవిక చేసిన కామెంట్స్ వైరల్ గా మారాయి.






## మెగా ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్..

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న రూరల్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'. 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఇక ఇందులో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తోంది. అలాగే శివరాజ్ కుమార్ , జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఏ.ఆర్ .రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్నారు.ఇక ఈ సినిమా సమ్మర్ స్పెషల్ గా మార్చి 7న థియేటర్లలో రిలీజ్ కానుంది. అయితే ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల అయిన ఫస్ట్ సింగిల్ 'చికిరి చికిరి' సోషల్ మీడియాలో ట్రెండింగ్ గా మారి సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేసింది. ఈ నేపథ్యంలో ఈ సినిమా నుంచి మరో ఇంట్రెస్టింగ్ అప్ డేట్ బయటి కొచ్చింది. సంక్రాంతి కానుకగా రెండో పాటను విడుదల చేయబోతున్నారని తెలుస్తోంది. అయితే 'చికిరి చికిరి' సూపర్ హిట్ కావడంతో.. రెండో పాట మీద మరింత అంచనాలు పెరిగాయి. ప్రస్తుతం ఈ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

## జననాయగన్ ఎఫెక్ట్..




నందమూరి బాలకృష్ణ హీరోగా అనిల్ రావిపూడి డైరెక్షన్ లో చ్చిన చిత్రం భగవంత్ కేసరి . 2023లో థియేటర్లలో విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులతో పాటు ఫ్యామిలీ ఆడియన్స్ ను కూడా ఆకట్టుకుంది. ముఖ్యంగా బాలకృష్ణ తన మాస్ ఇమేజ్ ను పక్కన పెట్టి బానవో భేటీ కో షేర్ అనే కాన్సెప్ట్ తో వచ్చిన ఈ సినిమాలో నటించి మెప్పించాడు. ఈ సినిమా కథ, కథనం, మహిళా శక్తి అంశం ఆడియెన్స్ నుండి మంచి గుర్తింపు తెచ్చుకోవడమే కాదు జాతీయ బెస్ట్ ఫిల్మ్ గా అవార్డు కూడా అందుకుంది.కాగా ఇప్పుడు ఈ సినిమాను తమిళ స్టార్ హీరో విజయ్ హీరోగా జననా యగన్ పేరుతో రీమేక్ చేస్తున్నారు. ఈ సంక్రాంతి కానుకగా జనవరి 9న వరల్డ్ వైడ్ గా రిలీజ్ కు రెడీగా ఉంది. అయితే మా సినిమా రీమేక్ కాదని వాదిస్తూ వచ్చారు జన నాయగన్ దర్శకుడు హెచ్ వినోద్. తీరాట్రైలర్ రిలీజ్ అయ్యాక అందరి అంచనాలను నిజం చేస్తూ భగంవత్ కేసరి సినిమాను రీమేక్ మాత్రమే కాదు ఏకంగా ఫ్రేమ్ టు ఫ్రేమ్ రీమేక్ చేశాడు హెచ్ వినోద్. మరోవైపు బాలయ్య భగవంత్ కేసరికి విజయ్ జననాయగన్ కు కంపారిజాన్స్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. అలాగే అమెజాన్ ప్రైమ్ లో ఉన్న భగవంత్ కేసరి సినిమాను చూసేస్తున్నారు. దాంతో టాప్ 1 లో ట్రేండింగ్ కు వచ్చేసింది భగవంత్ కేసరి. ఏదేమైనా జననాయగన్ ట్రైలర్ చూసాక బాలయ్య మాస్ పర్ఫామెన్స్ ను విజయ్ మ్యాచ్ చేయలేదనే చెప్పాలి.



## బేబమ్మగా తెలుగు ఆడియన్స్ మదిలో


అలా చాలా సినిమాల్లో నటించినా ఉప్పెన లాంటి హిట్ అయితే రాలేదు. దీంతో కొన్ని రోజులు తెలుగు ఇండస్ట్రీకి దూరమైంది.ప్రజెంట్ ప్రదీప్ రంగనాథ్ హీరోగా నటిస్తున్న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'మూవీలో నటిస్తున్న ఈ చిన్నది.. రీసెంట్ గా స్టార్ హీరో కార్తి నటించిన 'అన్నగారు వస్తారు' మూవీతో మన ముందుకు వచ్చింది. నలన్ కుమార స్వామి) దర్శకత్వం వహించిన ఈ సినిమాను స్టూడియో గ్రీన్ బ్యానర్ పై కేఈ జ్ఞాన్ వేల్ రాజా నిర్మించారు. అయితే థియేటర్లలో రిలీజ్ అయిన ఈ చిత్రం మిక్స్ డ్ టాక్ తెచ్చుకుంది.ఇదిలా ఉంటే.. ఈ భామ సోషల్ మీడియాలో చేసే రచ్చ మామూలుగా ఉండదు. నిత్యం స్టైలిష్ వేర్, ట్రెడిషనల్ డ్రెస్సులతో కుర్రకారును ఫిదా చేస్తూ ఉంటుంది. ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. తాజాగా కృతి శెట్టి తన ఇన్ స్టా అకౌంట్ లో కొన్ని ఫొటోలు షేర్ చేసింది. అందులో చీర కట్టుకొని హెయిర్ లీవ్ చేసుకుని కొంచెం ఘాటు పోజులిచ్చింది. అంతేకాకుండా చెస్ట్ పార్ట్ కనిపించేలా బోల్డ్ షో చేసింది. కుర్చీపై కూర్చొని వయ్యారాలు వలక బోసింది. దీంతో ఈ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారాయి. ఇక వాటిని చూసిన నెటిజన్లు టాలెంట్ చూపిస్తున్నావా అంటూ కామెంట్లు చేస్తున్నారు.

## కాంతార బ్యూటీకి మరో తెలుగు ఛాన్స్..

ప్రజెంట్ ఇండస్ట్రీలో బాగా వినపడతున్న పేరులో రుక్మిణీ వసంత్ ఇకరు. కన్నడ చిత్రం 'సప్త సాగరదాచె ఎల్లో'తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. తన అందం నటనతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. ఇక రీసెంట్ గా 'కాంతార: చాప్టర్ 1'లో కనకవతిగా సెన్సేషన్ సృష్టించిన రుక్మిణీ వసంత్ టాలీవుడ్ లో వరుస అవకాశాలు దక్కించుకుంటోంది. ఇప్పటికే ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ సినిమాతో ఎంట్రీ ఇస్తున్న ఈ భామ, ఇప్పుడు యంగ్ హీరో శర్వానంద్ సరసన మరో క్రేజీ ఆఫర్ కొట్టేసింది. సీనియర్ దర్శకుడు శ్రీను వైట్ల దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనున్న ఈ సినిమాలో రుక్మిణి హీరోయిన్ గా ఎంపికైనట్లు తెలుస్తోంది. తన అందం, అభినయంతో ఇప్పటికే కుర్రకారు హృదయాలను కొల్లగొట్టిన ఈ బ్యూటీ, శర్వానంద్ తో కలిసి ఎలాంటి మ్యాజిక్ చేస్తుందోనని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూ స్తున్నారు. ఇక,ఈ సినిమా కథ విషయానికి వస్తే, తెలియని వయసులో ఆవేశంగా చేసిన ఒక పని వల్ల హీరో జీవితంలో ఎలాంటి డ్రామా చోటుచేసు కుందనే ఆసక్తికర పాయింట్ తో శ్రీను వైట్ల ఈ స్క్రిప్ట్ ను సిద్ధం చేశారు. 'విశ్వం' తర్వాత ఎలాగైనా ఒక హిట్ అందుకోవాలనే పట్టుదలతో ఉన్న ఆయన, ఈ సినిమాలో ఒక సీనియర్ హీరోను కూడా ఒక కీలక పాత్ర కోసం తీసుకుం టున్నట్టు సమాచారం. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మార్చి నుంచి ప్రారంభం కానుంది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై వస్తుండటం, శ్రీను వైట్ల మార్క్ కామెడీతో కూడిన డ్రామా ఉండటంతో ఈ ప్రాజెక్ట్ పై మంచి అంచనాలు నెలకొన్నాయి.





## పారిస్‌లో 'వారణాసి' హిస్టరీ..




టాలీవుడ్ దిగ్గజ దర్శకధీరుడు రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్ లో రాబోతున్న భారీ అడ్వెంచర్ థ్రిల్లర్ 'వారణాసి' అప్పుడే రికార్డులు సృష్టించడం మొదలుపెట్టింది. సుమారు రూ.1300 కోట్ల భారీ బడ్జెట్ తో హాలీవుడ్ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తోంది. అయితే తాజాగా ఈ సినిమా 'ఎనౌన్స్ మెంట్ టీజర్' గురించి ఒక సెన్సేషనల్ న్యూస్ బయటకు వచ్చింది. ఈ టీజర్ ను పారిస్ లోని ప్రతిష్టాత్మకమైన 'లే గ్రాండ్ రెక్స్ ' థియేటర్ లో ప్రదర్శించ బోతున్నారు. ఇలా పారిస్ లో గ్రాండ్ గా టీజర్ లాంచ్ జరుపుకుంటున్న తొలి భారతీయ చిత్రంగా 'వారణాసి' చరిత్ర సృష్టించబోతోంది. కాగా,ఈ చారిత్రాత్మక ప్రదర్శన జనవరి 5, 2026న (ఈరోజు) రాత్రి 9 గంటలకు జరగనున్నట్లు ఫ్రెంచ్ పంపిణీ సంస్థ 'ఆన్నా ఫిల్మ్స్' అధికారికంగా ప్రకటించింది. పెద్ద తెరపై అత్యున్నత సాంకేతికతతో ఈ టీజర్ ను అభిమానుల ముందుకు తీసుకురానున్నారట. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి విజయేంద్ర ప్రసాద్ కథను, దేవా కట్టా మాటలను సమకూరుస్తున్నారు. ఇండియన్ సినిమా స్టాండర్డ్స్ ను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేలా ప్లాన్ చేస్తున్న రాజమౌళి, ఈ టీజర్ తోనే సినిమా ఏ రేంజ్ లో ఉండబోతుందో శాంపిల్ చూపించబో తున్నారు.

## ఉస్తాద్ భగత్ సింగ్ హీట్ పెంచిన దేవిశ్రీ




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్.. మాస్ డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబినేషన్ లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'ఉస్తాద్ భగత్ సింగ్' (Ustaad Bhagat Singh). గబ్బర్ సింగ్ వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత వీరిద్దరూ కలిసి పని చేస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన 'దేఖ్ లేంగే సాలా' సాంగ్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్న విషయం తెలిసిందే. చాలా కాలం తర్వాత పవన్ కళ్యాణ్ తన ట్రేడ్ మార్క్ మేనరిజమ్స్ తో మరియు ఎనర్జిటిక్ డ్యాన్స్ తో ఫ్యాన్స్ ని అలరించారు. దేవి శ్రీ ప్రసాద్ అందించిన మాస్ ట్యూన్స్, పవన్ స్టైలిష్ లుక్స్ ఈ పాటకు చార్ట్ బస్టర్ గా నిలిపాయి. శ్రీలీల మరియు రాశి ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 2026లో గ్రాండ్ గా విడుదల కానుంది.ఇదిలా ఉండగా, సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ (DSP) స్వయంగా ఈ పాటకి స్టెప్పులు వేసిన వీడియో ఇప్పుడు ఇంటర్నెట్ ను షేక్ చేస్తోంది. విదేశీ వీధుల్లో 'దేఖ్ లేంగే సాలా' పాటకు తనదైన స్టైల్లో దేవి వేసిన స్టైలిష్ స్టెప్స్ చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. దేవి ఎనర్జీకి ఈ వీడియో ఒక నిదర్శనమని, కేవలం మ్యూజిక్ ఇవ్వడమే కాకుండా పాటను ఎలా ఎంజాయ్ చేయాలో కూడా ఆయన చూపించారని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ అధికా రికంగా షేర్ చేసిన ఈ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. గతంలో 'గబ్బర్ సింగ్'కి అదిరిపోయే మ్యూజిక్ ఇచ్చిన డిఎస్పీ, ఇప్పుడు 'ఉస్తాద్ భగత్ సింగ్'తో మరోసారి మ్యాజిక్ రిపీట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**